


వైసీపీ పాలనలో నవరత్నాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోంది. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 27.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 127 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


# సంజీవనితో స్మార్ట్ వైద్యం!

- జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'
- కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ
- ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం
- వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**అమరావతి, ఆగస్ట్ 26(జర్నలిస్ట్ ఫైల్) :** వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవని ప్రాజెక్ట్'పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

**డేటా గోప్యత, భద్రతకు ప్రాధాన్యం :** సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు... డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్ధవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి.

మిగతా 2లో...



# అమరావతి చరిత్ర సృష్టించబోతోంది..!

- మానవ వనరుల అభివృద్ధి శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే
- అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే లక్ష్యం
- స్పీడ్.. సర్వీస్.. స్టెబిలిటీ..
- పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ విజయ రహస్యం
- ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40 అవార్డు అందుకున్న నారా బ్రాహ్మణి
- కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరణ




**ముంబాయ్ (జర్నలిస్ట్ ఫైల్) :** భారత దేశంలో అత్యంత ప్రతిభావంతులైన యువ నాయకులు, చేంజ్ మేకర్లు, బిజినెస్ మైండ్స్ కు ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40 పేరిట ముంబాయిలో అవార్డులను ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. దేశంలో డైరీ వాల్యూయాడెడ్ ఉత్పత్తుల్లో ప్రత్యేకత సాధించిన హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ నారా బ్రాహ్మణికి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్ లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఆర్ పిఎస్ జి గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలిచ్చారు. దేశంలోని మిగతా రాష్ట్రాలకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ వేగంగా పెట్టుబడుల ఆకర్షణకు రెండు ప్రధాన కారణాలను మంత్రి లోకేష్ తెలిపారు. స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ

మిగతా 2లో...

# అమరావతికి అద్భుత శాసనసభ!

- ప్రపంచస్థాయి రూపకల్పన.. తెలుగు సంస్కృతి-ఆధునిక వాస్తుశిల్పం మేళవింపు
- నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్‌తో కీలక చర్చలు



**అమరావతి, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని శాసనసభ భవనాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ఆధునిక వాస్తుశిల్పం-తెలుగు సంస్కృతి సమ్మేళనంగా, రాష్ట్ర ప్రజాస్వామ్య వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా శాసనసభ భవన డిజైన్, నిర్మాణ ప్రణాళిక, ఇంటీరియర్ డిజైన్,

మిగతా 2లో...

# నేపాల్‌లో ప్రకృతి బీభత్సం!



- భూకంపం.. కొండచరియలు.. ఆపై భోటెకోశీకి వరద పోటు
- వందలాది మంది గల్లంతు.. భవనాలు, వాహనాలు కొట్టుకుపోయిన విషాదం
- నదికి కొండచరియలు అడ్డుపడటంతో ఆకస్మిక వరదలు
- భారతీయులు సైతం గల్లంతైనట్లు సమాచారం

**నేపాల్:** నేపాల్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. ప్రకృతి ప్రకోపానికి రసువా జిల్లాలో భోటెకోశీ నది ఉగ్రరూపం దాల్చడంతో భారతీయులు సహా వందలాది మంది గల్లంతయ్యారు. అనేక భవనాలు, వాహనాలు కొట్టుకుపోయాయి. బురదలో అనేక మంది కూరుకుపోయినట్లు అంచనా వేస్తున్నారు. అయితే, భూకంపం ఆపై

మిగతా 2లో...

## పేపర్ లీక్.. నియామకాలు రద్దు!

- డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నియామకాలు రద్దు!
- మహారాష్ట్రలో ప్రశ్నాపత్రం లీక్ కలకలం
- మార్చి 22న జరిగిన స్క్రీనింగ్ పరీక్షపై పోలీసుల విచారణ
- అభ్యర్థికి ముందే ప్రశ్నాపత్రం అందినట్లు ప్రాథమిక నిర్ధారణ
- ఎంపిఎస్‌సి రద్దు చేసిన నియామక ప్రక్రియ
- త్వరలో పునఃపరీక్ష.. పాత అభ్యర్థులకు ఫీజు, దరఖాస్తు అవసరం లేదు

3

## బస్సు.. లారీ ఢీ! ఆరుగురి మృతి

- కోదాడ శివారులో తెల్లవారుజామున ఘోర ప్రమాదం
- ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు.. లోపలికి దూసుకొచ్చిన ఇనుప షీట్లు
- ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు మృతి.. 20 మందికి తీవ్ర గాయాలు

# వెలిగొండ.. చంద్రబాబు సంకల్ప ఫలం!


- నిర్వాసితులకు పేరు, పేరునా పాదాభివందనం చేస్తున్నా
- నిర్వాసితులకు అన్ని సదుపాయాలు కల్పించాలి
- 31న సీఎం చేతుల మీదుగా వెలిగొండ ప్రారంభం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 31న మూడు దశాబ్దాల వెలిగొండ కల సాకారం కాబోతోందని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి రామానాయుడు చెప్పారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 31న ఈ ప్రాజెక్టు ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేశారు. ప్రాజెక్టు ప్రారంభ సన్నాహక ఏర్పాట్లలో భాగంగా ఆయన మంగళవారం రాత్రి ఫీడర్ కెనాల్ లో ముఖ్యమంత్రి ప్రారంభించే రెగ్యులేటర్ గేట్లు అమర్చే పనులను పరిశీలించారు. వెలిగొండ వద్ద ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చే, ఘాట్, స్థూపం, సభాస్థలం ఏర్పాట్ల పై అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. నిర్వాసితుల కాలనీలను సందర్శించి, మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్ కు, అధికారులకు పలు సూచనలు చేశారు. వెలిగొండ ప్రారంభోత్సవ వేళ చంద్రబాబుకి, నిర్వాసితులకు ఇక్కడి ప్రజలంతా రుణపడి ఉండాలన్నారు.

వెలుగొండ కోసం భూములు, ఆస్తులు త్యాగం చేసిన నిర్వాసితులందరికీ, పేరు పేరునా పాదాభివందనాలు చేస్తున్నామన్నారు. 7వేల నిర్వాసితుల కుటుంబాల త్యాగఫలితమే నేడు, లక్షలాది ఎకరాలకు సాగు, లక్షలాది ప్రజలకు త్రాగునీరు అందబోతుందన్నారు.

మిగతా 2లో...



# మగ్గం నేసే ప్రతి నేతన్నకూ 'నేతన్నల సేవలో'

- అర్హులందరికీ రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తాం: మంత్రి సవిత

**పెనుకొండ ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మగ్గం నేసే ప్రతి అర్హుడైన నేతన్నకు 'నేతన్నల సేవలో' పథకం ద్వారా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 71,536 మంది నేతన్నలకు ఆర్థిక సాయం అందించామని, కొత్తగా 36,617 దరఖాస్తులు వచ్చాయని

మిగతా 2లో...

# ఆరోగ్యానికి కేంద్రం భారీ చేయూత!

- జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.2,447.98 కోట్ల నిధులు
- 2026-27 రాష్ట్ర వార్షిక ప్రణాళికకు కేంద్రం ఆమోదం
- మానవ వనరులు, క్షయ నిర్మూలన, ఉచిత డయాగ్నస్టిక్స్‌కు అధిక కేటాయింపులు
- అత్యవసర వైద్యం, టెలీ కన్సల్టేషన్‌కు కొత్తగా రూ.75.50 కోట్లు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలుకు 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,447.98 కోట్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం వాటా రూ. 1,468.79 కోట్లు కాగా.. రాష్ట్ర వాటా రూ. 979.19 కోట్లు. అందుబాటులో ఉన్న నిధులతో రాష్ట్రం ప్రాధాన్యతా క్రమంలో కార్యక్రమాలను అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రకటన జారీ చేశారు

**సిబ్బంది జీతాలకు రూ.1,008.50 కోట్లు :** జాతీయ ఆరోగ్య మిషన్ లో మానవ వనరులు, సిబ్బంది జీతాలకు అత్యధికంగా రూ. 1,008.50 కోట్లు కేటాయించారు. వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది జీతాల వ్యయంలో కొంత భాగాన్ని కేంద్రం రీయింబర్స్ చేయనుంది. మందులు, వ్యాక్సిన్లు, రియాజెంట్లకు రూ. 411.12 కోట్లను వస్తు గ్రాంట్ల రూపంలో కేంద్రం సమకూర్చనుంది. రొటీన్ ఇమ్యునైజేషన్, వైరల్ హెపటైటిస్, మలేరియా, డెంగ్యూ, క్షయ నియంత్రణ కార్యక్రమాలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు, రియాజెంట్లను వీటి ద్వారా అందించనున్నారు.

**క్షయ నిర్మూలనకు రూ.116.50 కోట్లు :** క్షయ వ్యాధి నియంత్రణ,

మిగతా 2లో...

# ఏడుగురు మత్స్యకారులు క్షేమం



- శంకర్‌పూర్ హార్బర్ సమీపంలో బోటు గుర్తింపు.. కుటుంబాల్లో ఊరట
- సముద్రం, గగనతలం నుంచి విస్తృత గాలింపు.. నేవీ, కోస్ట్‌గార్డ్‌తో సమన్వయం
- మత్స్యకారుల భద్రతకు సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత
- స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు: మంత్రి అచ్చెన్నాయుడు

3 లో

# సంజీవనితో స్మార్ట్ వైద్యం!



(మొదటి పేజీ తరువాయి)

విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చెప్పారు.

**వ్యాధుల నియంత్రణకు దోహదం :** కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వెలిగొండ.. చంద్రబాబు సంకల్ప ఫలం!



(మొదటి పేజీ తరువాయి)

నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది. భవిష్యత్ లో వాళ్ళకి అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం 5ఏళ్ళలో నిర్వాసితులను పచ్చి మోసం, దగా చేసిందన్నారు. నిర్వాసితులకు 900కోట్లు ఇవ్వాల్సి ఉన్నా, గత 5ఏళ్ళలో ఒక్క రూపాయి కూడా విదల్చలేదని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు 40 రోజుల్లోనే 768 కోట్లు ఇచ్చా మన్నారు. ప్రతి గ్రీవెన్స్‌ని పరిశీలించి,అర్హులైన ప్రతి ఒక్కరికీ కూడా న్యాయం చేయమని చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారని ఆయన చెప్పారు. ?వెలిగొండ నుండి నీళ్లు వస్తున్నందుకు రైతులకు కళ్లల్లో ఆనందం ఎట్లానో, నిర్వాసితుల్లో కూడా అంతే ఆనందంగా ఉండాలనేది కూటమి ప్రభుత్వ తాపత్రయమని పేర్కొన్నారు.

బడులు, గుడులు, మసీదులు, కమ్యూనిటీ హాల్స్, పంచాయితీ ఆఫీసులు, సిమెంట్ రోడ్లు, డ్రైన్స్ తో నిర్వాసితుల కాలనీలు రాత్రిళ్ళు సైతం విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా ఉన్నాయంటే గత టిడిపి ప్రభుత్వంలో చేసిన నిర్మాణాలే కారణమని ఆయన చెప్పారు.

ముంపు గ్రామాల నిర్వాసితులు ఎక్కడ నివసి స్తున్నారో గుర్తించి రేషన్, పెన్షన్ వంటి వాటికి, ఎటువంటి ఆటంకం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను ఆదేశించారు.

గత వైసిపి ప్రభుత్వం నిర్వాసిత కాలనీల్లో పెరిగిన తుప్పలను కూడా తొలగించలేదన్నారు. నాడు, నేడు నిర్వాసితులకు అండగా ఉంది చంద్రబాబు మాత్రమే ఆయన స్పష్టం చేశారు. నిర్వాసిత కుటుంబాలు సొంత ఇళు ్ళకట్టుకుని, గృహప్రవేశాలు చేసే వరకూ అధికారులు, నాయకులు అండగా ఉంటారని మంత్రి రామానాయుడు వారికి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం. విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్ సలహాదారులు ఎం. వెంకటేశ్వరరావు, యర్రగొండ పాలెం టిడిపి ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజెక్ట్ సిఈ రమేష్ , ఎస్ఈ అబూతలేం మరియు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మగ్గం నేసే ప్రతి నేతన్నకూ 'నేతన్నల సేవలో'



(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ప్రస్తుతం ఇంటింటికీ వెళ్లి అర్హుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి, ఆ వెంటనే రెండో విడతలో మిగిలిన అర్హుల బ్యాంకు ఖాతాల్లో రూ. 25 వేల చొప్పున జమ చేస్తామని వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా నేతన్నలకు ఆర్థిక మేలు చేకూర్చాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పేర్కొన్నారు.

చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనంతో పాటు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. 2014-19 పాలనా కాలంలో తొలిసారిగా 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల పెన్షన్‌ను రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెంచామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 86 వేల మంది నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందుతున్నాయని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. మగ్గం నేసే వారికి 200 యూనిట్లు, మరమగ్గాల వారికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ప్రస్తుతం 51,952 మంది నేతన్నలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా క్లస్టర్లు, టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు ఆధునిక రెడీమేడ్ దుస్తుల తయారీలో శిక్షణ, త్రిఫ్ట్ ఫండ్, 90 శాతం రాయితీతో పనిముట్లు, చేనేత ఉత్పత్తుల విక్రయాల కోసం ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. రూ. 10.44 కోట్లతో 10 చిన్న క్లస్టర్లు, ధర్మవరంలో రూ. 38 కోట్లతో మెగా చేనేత క్లస్టర్, మంగళగిరిలో చేనేత పార్క్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

'నేతన్నల సేవలో' పథకంపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ నేతన్నల్లో అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. నేతన్నలకు మేలు చేయడం ఇష్టంలేకే వైసీపీ నాయకులు ఈ పథకంపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మగ్గం కలిగి ఉన్న ప్రతి అర్హుడైన నేతన్నకు పథకం కింద ఆర్థిక సాయం అందుతుందని స్పష్టం చేశారు. అర్హుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే రెండో విడత సాయం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. వైసీపీ నేతల తప్పుడు ప్రచారాన్ని నమ్మి ట్రాప్‌లో పడొద్దని నేతన్నలకు మంత్రి సవిత సూచించారు.

# అమరావతి చరిత్ర సృష్టించబోతోంది..!

(మొదటి పేజీ తరువాయి)

తమ విజయ రహస్యమని తెలిపారు. శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలు ఇలా ఉన్నాయి.

**శాశ్వత్ గోయెంకా:** ప్రభుత్వ నిర్వహణలో మీరు ఒక లిడిసిప్లేన్ ఆపరేషన్‌లి తీసుకువస్తున్నారు. మీరు గతంలో అనేకసార్లు పొదుపు గురించి, ప్రతి రూపాయి ఎంత ముఖ్యమో మాట్లాడారు. ఆ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది? అది మీరు ప్రభుత్వాన్ని నడిపే విధానాన్ని ఎలా మార్చింది?

**నారా లోకేష్:** వ్యాపారం అయినా, రాజకీయాలు అయినా- మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమే అని నేను నమ్ముతాను. అదే విధానాన్ని రాజకీయాల్లో కూడా అవలంబిస్తున్నాం. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. నాకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లాలన్నదే నా ఆలోచన. గతంలో వ్యాపారంలోనూ ఇదే విధానాన్ని అనుసరించాను. ఇప్పుడు అధికారిక బాధ్యతలోనూ ఇదే విధానంతో ముందుకు వెళ్తున్నాను. మనందరం, ముఖ్యంగా రాజకీయ నాయకులు సంస్థలను నిర్మించే వ్యక్తులుగా ఉండాలి అని నేను బలంగా నమ్ముతున్నాను.

**శాశ్వత్ గోయెంకా:** ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, రాష్ట్రం కోసం మీరు ఎంతో ప్రతిష్టాత్మకమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. పరిశ్రమలు కూడా దానికి సానుకూలంగా స్పందిస్తున్నాయి. కానీ ప్రస్తుతం ప్రతి రాష్ట్రం పెట్టుబడుల కోసం పోటీ పడుతోంది. ఒక రాష్ట్రంపై వ్యాపార సంస్థలు విశ్వాసం ఉంచాలంటే నిజంగా ఏం కావాలి? ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటి?

**నారా లోకేష్:** దీనికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి.



మొదటిది మేము అనుసరిస్తున్న మూడు 'ఎస్'ల విధానం- స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే విధానాలు. మొదటిది - వేగం. మేము ఎంత వేగంగా పని చేస్తున్నామో ఇక్కడ ఉన్న అనేక పరిశ్రమల ప్రతినిధులు స్వయంగా చూశారు. రెండోది - సర్వీస్. చాలా మంది పెట్టుబడిదారులకు వారి పెట్టుబడుల ప్రస్తుతస్థితిపై నేను స్వయంగా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ ఇస్తుంటాను. దాదాపు ప్రతి శనివారం రాత్రి వారికి వ్యక్తిగతంగా మెసేజ్ పంపుతాను. పెట్టుబడిదారులు కోరుకునేది ఇదే అని నేను నమ్ముతున్నాను. మూడోది - పాలసీ స్థిరత్వం. అంటే విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ పెట్టుబడిదారులు కోరుకునేది స్థిరమైన పాలసీ ఫ్రేమ్‌వర్క్. మా నాయకత్వం గతంలో తీసుకొచ్చిన విధానాలు రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడ్డాయి. ప్రభుత్వాలు మారవచ్చు, కానీ మా విధానాలు మాత్రం కొనసాగుతాయి. ఇది ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టే ఒక కారణం.

రెండో కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు. సిబిఎన్ అంటే ఒక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడుల కోసం అవసరమైన తలుపులు తెరవగలిగే ముఖ్యమంత్రి ఉండటం వల్ల మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం నేను సమావేశ మందిరంలోకి వెళ్లినపుడు ఒప్పందాన్ని ఖరారు చేస్తాను. మేమిద్దరం కలిసి ఈవిధంగా పనిచేస్తున్నాం. ఈ భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది.

**శాశ్వత్ గోయెంకా:** ముఖ్యమంత్రి గారి గురించి మాట్లాడుతున్నప్పుడు ఒక ప్రత్యేకమైన అవకాశం మీకు ఉంది. మీరు ఆయనతో కలిసి పనిచేస్తున్నారు, అదే సమయంలో ఆయన మీ తండ్రి కూడా. ఈరోజు ఇక్కడ ఉన్న మనలో చాలామంది తమ తండ్రులతో కలిసి పనిచేస్తున్నారు. ప్రభుత్వంపై మీ అభిప్రాయాలు ఆయన అభిప్రాయాల కంటే ఏ విషయంలో భిన్నంగా ఉంటాయి? అలాగే ఆయన నుంచి మీరు నేర్చుకున్న, భవిష్యత్తులో కొనసాగించాలని కోరుకునే విషయం ఏమిటి?

**నారా లోకేష్:** ఇక్కడ ఉన్న రెండో, మూడో, నాలుగో తరానికి చెందిన వ్యాపారవేత్తలందరికీ ఇది వర్తిస్తుంది. ప్రతిరోజూ తీసుకునే నిర్ణయాల విషయంలో మనం మన తల్లిదండ్రులతో విభేదించే సందర్భాలు ఉంటాయి. అయితే నా అభిప్రాయం కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలి. కొత్త రంగాల్లో, కొత్త వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలి. పరిశోధనపై పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఇది చాలా కీలకం. ఇక్కడే విద్య ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వివిధ ఖండాల్లో ఉన్న సంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య అనుసంధానం కల్పించి, పరిశోధన, కొత్త రంగాల్లో మరింత దృష్టి పెట్టవచ్చు. అది అంతరిక్ష రంగం కావచ్చు, క్వాంటమ్ టెక్నాలజీ కావచ్చు, మెటీరియల్ సైన్సెస్ కావచ్చు-భారతదేశం చేయగలిగేది ఎంతో ఉంది. మనమంతా కలిసి దీన్ని సాధించగలం. ఇక రాష్ట్రం తరఫున నేను కోరేది ఒక్కటే- ఈ మార్పులో మీరు కూడా భాగస్వాములు కండి. మనం వివిధ దేశాలు, వివిధ నగరాల గురించి, అక్కడ జరుగుతున్న మార్పుల గురించి మాట్లాడుతుంటాం.

నేను మీకు అందిస్తున్న వేదిక ఆంధ్రప్రదేశ్. మేము పూర్తిగా పరిపూర్ణంగా ఉన్నామని చెప్పడం లేదు. కానీ మేము చేసే ప్రతి తప్పు నుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా ఎలా తీర్చిదిద్దాలి? అనే విషయంలో మీ అభిప్రాయాలను స్వీకరించడానికి, మీతో కలిసి పనిచేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

రేపటి భారతదేశం, మన తర్వాత తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్ లో అమరావతి అనే నగరం మరోసారి చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించాలనేది మా లక్ష్యం. ఈరోజు ఇక్కడ ఉన్న 40 ఏళ్ల లోపు యువత నుంచి నేను కోరేది కూడా ఇదే.

# అమరావతికి అద్భుత శాసనసభ!



(మొదటి పేజీ తరువాయి)

ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, సుస్థిర నిర్మాణ విధానాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధుల బృందంతో రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, Foster + Partners Partner and Architect I Pedro Haberbosch, సంస్థ ప్రతినిధులతో పాటు సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, సీఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ ఏ.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శాసనసభ భవనం ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి, కళా వారసత్వం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఆధునిక అభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపకల్పన చేయడంపై విస్తృతంగా చర్చించారు. ఆధునిక వాస్తుశిల్ప సౌందర్యంతో పాటు, భవనం వినియోగించే ప్రతి వర్గానికి సౌకర్యవంతంగా, సమర్థవంతంగా ఉండేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించాలని అభిప్రాయపడ్డారు.

శాసనసభ సముదాయంలో ముఖ్యమంత్రి ఛాంబర్, శాసనసభ స్పీకర్ ఛాంబర్, డిప్యూటీ స్పీకర్ ఛాంబర్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ కార్యాలయం, బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశ మందిరం, మంత్రులు మరియు శాసనసభ్యుల కార్యాలయాలు, వివిధ శాసనసభ కమిటీల సమావేశ మందిరాలు తదితర విభాగాలను సమగ్రంగా ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు.

అదేవిధంగా ప్రధాన సభా మందిరం, కమిటీ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్స్, శాసనసభ్యుల లాబీలు, ప్రోటోకాల్ ప్రాంతాలు, మీడియా సెంటర్, ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్, మీడియా వర్క్‌స్టేషన్లు, మీడియా బ్రీఫింగ్ సదుపాయాలు, సందర్శకుల గ్యాలరీలు, పబ్లిక్ లాంజ్‌లు, విజిటర్స్ రిసెప్షన్ ప్రాంతాలు వంటి కీలక సౌకర్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంపై ప్రతినిధులతో అభిప్రాయాలు పంచుకున్నారు.

శాసనసభ కార్యకలాపాలను ఆధునిక పద్ధతుల్లో నిర్వహించేందుకు ఆడియో-విజువల్ వ్యవస్థలు, డిజిటల్ ఓటింగ్, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, ఆధునిక కమ్యూనికేషన్ నెట్‌వర్క్, లైవ్ టెలికాస్ట్, బ్రాడ్‌కాస్టింగ్ సదుపాయాలు, డిజిటల్ శాసన వ్యవస్థలు వంటి సాంకేతిక మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు.

ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సందర్శకుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రవేశ మార్గాలు, ప్రోటోకాల్ మూవ్‌మెంట్, యాక్సెస్ కంట్రోల్, భద్రతా జోన్లు, పార్కింగ్, డ్రాప్--ఆఫ్, పికప్ ప్రాంతాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ వ్యవస్థలు వంటి అంశాలను డిజైన్‌లో సమర్థవంతంగా సమన్వయం చేయాలని చర్చించారు.

అంతర్గత రూపకల్పనలో సభా మందిరం, ముఖ్యమంత్రి మరియు స్పీకర్ ఛాంబర్లు, మంత్రులు-శాసనసభ్యుల కార్యాలయాలు, దీూజ సమావేశ మందిరం, ఇతర కమిటీ హాళ్లు, మీడియా సెంటర్ తదితర విభాగాలకు తగిన గౌరవం, సౌకర్యం, కార్యాచరణ సామర్థ్యం కల్పించడంతో పాటు, తెలుగు సంస్కృతి, కళలు, శిల్పకళ, చారిత్రక వారసత్వాన్ని ఆధునిక వాస్తుశిల్పంతో మేళవించేలా ఇంటీరియర్ డిజైన్ రూపొందించడంపై ప్రత్యేకంగా చర్చించారు.

అన్ని వర్గాల ప్రజలకు సులభమైన వినియోగాన్ని కల్పించేలా Universal Accessibility ప్రమాణాలు, ర్యాంపులు, లిఫ్టులు, ఆధునిక సానిటేషన్ సదుపాయాలు, సులభమైన అంతర్గత రాకపోకల మార్గాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో సహజ కాంతి-గాలి ప్రసరణ, నీటి సంరక్షణ, వర్షపు నీటి నిర్వహణ, పర్యావరణహిత నిర్మాణ విధానాలు, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలు వంటి సుస్థిరత అంశాలను కూడా డిజైన్‌లో అంతర్భాగం చేయాలని చర్చించారు.

భద్రతకు సంబంధించి CCTV నిఘా, యాక్సెస్ కంట్రోల్, ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, ఫైర్ సేఫ్టీ తదితర ఆధునిక వ్యవస్థలను సమగ్రంగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సమావేశంలో వివరించారు.

అమరావతిని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా, శాసనసభ భవనం కేవలం పరిపాలనా నిర్మాణంగా కాకుండా రాష్ట్ర ప్రజాస్వామ్య స్ఫూర్తికి, తెలుగు సంస్కృతి-వారసత్వానికి, ఆధునిక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలకు చిరస్థాయి ప్రతీకగా నిలిచేలా నిర్మాణ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో దృష్టి సారించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా... తెలుగు సంస్కృతికి అద్దంగా... ఆధునిక ఆంధ్రప్రదేశ్ ప్రగతికి చిరునామాగా... అమరావతి శాసనసభ భవనం రూపుదిద్దుకునేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# పోలీస్ అధికారినంటూ ఫోన్ చేసి బెదిరింపులు

**తెనాలి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్పీ, సీఐలుగా గొంతు మార్చి ఫోన్ చేసి వడ్డీ వ్యాపారిని బెదిరించి రూ. 6.80 లక్షలు వసూలు చేసిన కేసులో నిందితుడు రత్నబాబును అరెస్ట్ చేశామని తెనాలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రవీంద్రబాబు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తెనాలి మండలం నేలపాడు గ్రామానికి చెందిన రత్నబాబు రాడ్ బెండింగ్ పనులు చేస్తూ.. జల్సాలకు అలవాటు పడ్డాడు. పట్టణంలోని ఒక జ్యూయలరీ దుకాణంలో వడ్డీ వ్యాపారి వద్ద చాలా కాలంగా బంగారం, వెండి వస్తువులు తాకట్టు పెట్టి నగదు తీసుకుని, తిరిగి కట్టి వస్తువులు తీసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో అతనితో పరిచయం పెరిగిన తర్వాత పలుమార్లు చేబదులుగా కొంత నగదు తీసుకున్నాడు. చంపుతానని బెదిరించి మరి కొంత తీసుకున్నాడు. అతని మంచితనాన్ని ఆసరాగా తీసుకుని తానే అతనికి ఫోన్ చేసి పోలీస్ అధికారినంటూ బెదిరించడం ప్రారంభించి పలు దఫాలుగా నగదు వసూలు చేశాడు. విషయాన్ని గ్రహించిన వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి, రూ. 40 వేలు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్సైలు లలిత్‌కుమార్, సురేష్, రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి కేంద్రం భారీ చేయూత!

(మొదటి పేజీ తరువాయి)



వ్యాధి గుర్తింపు, చికిత్సకు రూ. 116.50 కోట్లు కేటాయించారు. ప్రజలకు ఉచితంగా పరీక్షలు అందించే డయాగ్నస్టిక్స్ కార్యక్రమానికి రూ. 114.55 కోట్లు మంజూరయ్యాయి. పిల్లలకు టీకాల కార్యక్రమాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు రొటీన్ ఇమ్యునైజేషన్‌కు రూ. 97.65 కోట్లు కేటాయించారు. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణ, కార్యకలాపాలకు రూ. 94.22 కోట్లు, అత్యవసర పరిస్థితుల్లో సత్వర రవాణా, వైద్య సేవలందించే 108 అంబులెన్స్ సేవలకు రూ. 92.95 కోట్లు కేటాయించారు.

జననీ శిశు సురక్షా కార్యక్రమానికి రూ. 88.66 కోట్లు, నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌కు రూ. 79.82 కోట్లు, అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమానికి రూ. 77.58 కోట్లు, ఉచిత మందుల కార్యక్రమానికి రూ. 77.52 కోట్లు కేటాయించారు. కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్‌కు రూ. 72.22 కోట్లు, ఫెసిలిటీ బేస్డ్ న్యూ బోర్న్ కేర్ కు రూ. 70.62 కోట్లు, వైద్య పరికరాల నిర్వహణకు రూ. 69.93 కోట్లు మంజూరయ్యాయి.

**క్యాన్సర్, మధుమేహ నియంత్రణకు రూ.68.28 కోట్లు :** క్యాన్సర్, మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులు, స్ట్రోక్ నియంత్రణ కార్యక్రమానికి రూ. 68.28 కోట్లు కేటాయించారు. ఉచిత డయాలసిస్ సేవలకు రూ. 67.78 కోట్లు, అంధత్వ నియంత్రణకు రూ. 62.68 కోట్లు, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వెక్టర్ బోర్న్ వ్యాధుల నియంత్రణకు రూ. 51.84 కోట్లు కేటాయించారు. క్వాలిటీ అస్యూరెన్స్ కార్యక్రమానికి రూ. 39.82 కోట్లు, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిధులకు రూ. 35.10 కోట్లు, జన ఆరోగ్య సమితులకు రూ. 32.97 కోట్లు, జననీ సురక్షా యోజనకు రూ. 31.75 కోట్లు కేటాయించారు.

**అత్యవసర వైద్యానికి ప్రాధాన్యం :** 2026-27లో జాతీయ ఆరోగ్య మిషన్ కింద కొత్తగా చేపట్టనున్న ఐదు కార్యక్రమాలకు కలిపి రూ. 75.50 కోట్లు కేటాయించారు. గుండెపోటు బాధితులకు అత్యవసరంగా వినియోగించే స్టేమి మందుల కొనుగోలు, సరఫరాకు రూ. 26.60 కోట్లు కేటాయించారు. కేర్ కోఆర్డినేషన్, టెలీ కన్సల్టేషన్ రూమ్‌ల ఏర్పాటుకు రూ. 25.88 కోట్లు, టెలీ కన్సల్టేషన్ల కోసం డెస్క్‌టాప్ కంప్యూటర్లకు రూ. 11.01 కోట్లు, అత్యవసర ట్రామా కేర్ పరికరాలకు రూ. 7.25 కోట్లు, బర్న్ యూనిట్ల పరికరాలకు రూ. 4.76 కోట్లు కేటాయించారు. దీంతో అత్యవసర వైద్య సేవలతోపాటు టెలీ కన్సల్టేషన్ వ్యవస్థను మరింత విస్తరించే అవకాశం ఏర్పడింది.


**గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి :** ట్రైబల్ ఆర్.సీ. హెచ్ కార్యక్రమానికి రూ. 25.18 కోట్లు, బ్లడ్ సెల్‌కు రూ. 26.28 కోట్లు కేటాయించారు. లెప్రసీ నిర్మూలన కార్యక్రమానికి రూ. 11.47 కోట్లు, వైరల్ హెపటైటిస్ నియంత్రణకు రూ. 11.77 కోట్లు, మొబైల్ మెడికల్ యూనిట్లకు రూ. 12.46 కోట్లు మంజూరయ్యాయి. మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో మొబైల్ మెడికల్ యూనిట్లు కీలకం కానున్నాయి.

**రూ.411.12 కోట్లు వస్తు గ్రాంట్లు :** మొత్తం రూ. 2,447.98 కోట్ల రిసోర్స్ ఎన్వలప్ లో రూ. 411.12 కోట్లు వస్తు గ్రాంట్ల రూపంలో, రూ. 120.70 కోట్లు ఇన్ఫ్రాస్ట్రక్చర్ మెయింటేనేన్స్ కింద కేటాయించారు. దీంతో వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు వినియోగించేందుకు నికరంగా రూ. 1,916.16 కోట్ల నగదు అందుబాటులో ఉంటుంది. కేంద్రం ఆమోదించిన కార్యకలాపాల విలువ రిసోర్స్ ఎన్వలప్ కంటే ఎక్కువగా ఉన్న నేపథ్యంలో.. అందుబాటులో ఉన్న నిధులను అత్యంత అవసరమైన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాల్సి ఉంటుంది. 2026-27లో ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర వాటాలను కలిపి రూ. 1,175.03 కోట్ల బడ్జెట్ విడుదలైంది.

**ప్రజలకు నేరుగా ప్రయోజనం: మంత్రి**

కేంద్రం ఆమోదించిన నిధులను ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరేలా వినియోగిస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయడంతోపాటు టెలీ కన్సల్టేషన్ వ్యవస్థను విస్తరిస్తామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# నేపాల్‌లో ప్రకృతి బీభత్సం!



(మొదటి పేజీ తరువాయి)

కొండచరియలు విరిగిపడటంతోనే భోటెకోశీ నది ప్రళయానికి కారణమని నేపాల్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

"బుధవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో భూకంపం వచ్చింది. దాని కారణంగా భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. నది ప్రవాహానికి అడ్డుపడడం ఆకస్మిక వరదలకు కారణమైనట్లు తెలుస్తోంది" అని విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టామని, పొరుగు దేశాల సహకారం తీసుకుంటున్నామని అన్నారు.

**నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్ :** వరదల కారణంగా ప్రాణనష్టం సంభవించడంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. మానవతాసాయం అందించడంతోపాటు రెస్క్యూ ఆపరేషన్‌లో తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆపద కాలంలో నేపాల్‌కు యావత్ భారత ప్రజలు తోడుగా ఉంటారని భరోసా ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు ఆపన్నహస్తం అందించేందుకు భారత్ ఏర్పాట్లు మొదలుపెట్టింది. వాయుసేన విమానాల ద్వారా సహాయక సామగ్రి తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నిత్యావసర సరుకులు, ఔషధాలు పంపిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను తరలించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## పేపర్ లీక్.. నియామకాలు రద్దు!




**ముంబయి (జర్నలిస్ట్ ఫైల్) :** పేపర్ లీక్ కారణంగా మహారాష్ట్రలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల నియామకం నిలిచిపోయింది. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని గ్రూప్ బి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియను మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపిఎస్‌సి) బుధవారం రద్దు చేసింది. మార్చి 22న నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీకైనట్లు ముంబయి పోలీసుల విచారణలో నిర్ధారణ కావడంతో ఎంపిఎస్‌సి ఈ నిర్ణయం తీసుకుంది. పరీక్షకు ముందే తాము ప్రశ్నాపత్రాన్ని పొందినట్లు జులై 22–26మధ్య కొందరు ఎంపిఎస్‌సి అభ్యర్థులు పేర్కొన్నారు. మరికొందరు సోషల్ మీడియాలో పూర్తి ప్రశ్నాపత్రం లభించిందని వెల్లడించారు. దీంతో ఎంపిఎస్‌సి జులై 27న ముంబయి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఒక అభ్యర్థికి ప్రశ్నపత్రం లభించిందని, దీంతో ఆ అభ్యర్థి లబ్ధి పొందారని ప్రాథమికంగా తేలినట్లు ముంబయి పోలీసు క్రైమ్ బ్రాంచ్ సమర్పించిన నివేదిక తెలిపింది. అయితే ఈ ప్రశ్నాపత్రంతో ఒకరు లేదా అంతకంటే ఎక్కువమంది లబ్ధి పొందారా లేదా అనేది స్పష్టంగా తెలియాల్సి వుందని స్పష్టం చేసింది.

మరోసారి పరీక్షను నిర్వహించనున్నట్లు ఎంపిఎస్‌సి తెలిపింది. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయనవసరం లేదని, ఎలాంటి పరీక్ష రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించింది. పునఃపరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడిగా ప్రచురించనున్నట్లు పేర్కొంది.

ఎంపిఎస్‌సి ఈ పోస్టుకు సంబంధించి గతేడాది జులై 29న తొలి నోటిఫికేషన్ జారీ చేయగా, రాష్ట్రంలోని ఆరు డివిజనల్ ప్రధాన కార్యాలయాల్లోని కేంద్రాల్లో మార్చి 22న ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. ఫలితాలను జూన్ 12న ప్రకటించారు. 506 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు అర్హులుగా తేల్చారు. వారిలో 488 మంది జులై 1 నుండి జులై 22 మధ్య జరిగిన రౌండ్‌లో ఉత్తీర్ణులయ్యారు. 488 మంది అభ్యర్థులతో కూడిన తాత్కాలిక సాధారణ మెరిట్ జాబితాను విడుదల చేయగా, అందులో 485 మంది అభ్యర్థులు అర్హులుగా పరిగణించబడ్డారు.

## రష్యా నుంచి భారీగా చమురు మద్దతు




**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా ఘర్షణలతో చమురు ఒత్తిడిని ఎదుర్కొంటున్న భారత్‌కు రష్యా నుంచి భారీ ఊరట లభిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026–27 జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో రష్యా నుంచి భారత్ చేసుకున్న స్థూల సరుకుల దిగుమతులు భారీగా పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే రష్యా నుంచి దిగుమతుల్లో ఏకంగా 52.59 శాతం వృద్ధి నమోదైంది. భారతీయ రిఫైనరీ కంపెనీలు రష్యా నుంచి రికార్డు స్థాయిలో ముడి చమురును కొనుగోలు చేయడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఒక్క త్రైమాసికంలోనే రష్యా నుంచి భారత ముడి చమురు దిగుమతులు 55 శాతం పెరగడం విశేషం. ?రెండు రోజుల రష్యా పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాస్కోలో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమైన సమయంలో ఈ వాణిజ్య వృద్ధి అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. అమెరికా నుంచి రష్యా చమురు కొనుగోళ్లపై ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఇరు దేశాల మధ్య వాణిజ్యం ఈ స్థాయిలో పెరగడం విశేషమని పుతిన్ కొనియాడారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక బంధం మరింత బలపడాల్సిన అవసరం ఉందని జైశంకర్ పేర్కొన్నారు. అదే విధంగా భారత్ ఎదుర్కొంటున్న తీవ్ర వాణిజ్య లోటు గురించి పుతిన్ దృష్టికి తీసుకెళ్లారు.

?గడిచిన జూన్ త్రైమాసికంలో భారత్–రష్యాల మధ్య మొత్తం వాణిజ్యం 50.48 శాతం పెరిగి 26.82 బిలియన్ డాలర్లకు చేరుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఇది 17.82 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురు విలువే సుమారు 23.61 బిలియన్ డాలర్లు (గతేడాది 15.14 బిలియన్ డాలర్లు)గా ఉంది. అయితే దిగుమతులు ఈ స్థాయిలో ఉన్నప్పటికీ రష్యాకు భారత ఎగుమతులు మాత్రం కేవలం 1.24 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. కేవలం ముడి చమురు మాత్రమే కాకుండా రష్యా నుంచి ఎరువులు, వృక్ష, జంతు సంబంధిత కొవ్వులు, రత్నాలు వంటివి కూడా భారత్ దిగుమతి చేసుకుంటోంది. అయితే, రష్యా నుంచి వచ్చే నాన్ ఇండస్ట్రియల్ వజ్రాలపై యూరప్ దేశాలు ఆంక్షలు కఠినతరం చేయడంతో రత్నాల దిగుమతులు తగ్గి గుజరాత్‌లోని సూరత్ వజ్రాల పరిశ్రమపై కొంత ప్రభావం పడింది.

## వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసిన అమెరికా

**వాషింగ్టన్ :** ప్రపంచ వ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. ట్రంప్ రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత, వలసదారులపై కఠిన చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో ఒక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు, ఈ శిక్షణకు అనుగుణంగా వీసాల అపాయింట్‌మెంట్‌లను సర్దుబాటు చేయనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మంగళవారం తెలిపారు. అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో ఇంటర్వ్యూలు షెడ్యూల్ చేసుకున్న ఇమ్మిగ్రెంట్ వీసా దరఖాస్తుదారులకు, వారి అపాయింట్‌మెంట్‌లు వాయిదా వేసినట్లు ఈమెయిల్స్‌లో వెల్లడించారు. కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆ మెయిల్స్‌లో పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉన్న దరఖాస్తుదారులను గుర్తించడంలో కాన్సులర్ అధికారులకు సహాయపడటం, అలాగే వీసా దరఖాస్తుదారుల పరిశీలన సమగ్రంగా, ఏకరీతిగా జరిగేలా చూడటం ఈ శిక్షణ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ శిక్షణకు సంబంధించిన వివరాలను లేదా ఎంత కాలం కొనసాగుతుంది అన్న వివరాలను ఆయన వెల్లడించలేదు. దేశ భద్రతను మెరుగుపరచడమే ఈ చర్యల ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ చర్యలకు కొన్ని న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. 75 దేశాల దరఖాస్తుదారులకు ఇమిగ్రెంట్ వీసాల జారీని నిలిపివేస్తూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న విధానం, సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియోకు చట్టపరంగా ఉన్న అధికార పరిధిని మించి ఉందని పేర్కొంటూ... అమెరికా న్యాయమూర్తి ఒకరు గతవారం ఆ విధానాన్ని రద్దు చేశారు. ట్రంప్ వలసల నియంత్రణ చర్యలు వివక్షాపూరితమైనవని, భావ ప్రకటనా స్వేచ్ఛ, న్యాయబద్ధమైన విచారణ హక్కులను ఉల్లంఘిస్తున్నాయని మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

# ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

- **ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రూ.30.66 కోట్లు నిధులు కేటాయింపు**
- **24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు**
- **టీటీడీ కల్యాణ మండపానికి రూ.2 కోట్లు**
- **48 భజన మందిరాలకు రూ.11.60 కోట్లు**
- **లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు**







**అమరావతి, ఆగష్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** "ఆధ్యాత్మికత కొలువైన క్షేత్రంలో అభివృద్ధి ఉండాలి.. చరిత్ర ఉన్న చోట పరిరక్షణ ఉండాలి.. సంస్కృతి ఉన్న చోట అది మరింత శోభిల్లాలి" అనేది ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృఢ సంకల్పం. పిఠాపురం నియోజకవర్గ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, ఆ వైభవాన్ని భవిష్యత్ తరాలకు మరింత ఘనంగా అందించాలనే కార్యాచరణ ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదాలుస్తోంది. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, భజన మందిరాల నిర్మాణం, కళ్యాణ మండపాల ఏర్పాటు కోసం ఏకంగా రూ. 30.66 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిరంతర పర్యవేక్షణలో ఈ అభివృద్ధి పనులు ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయి.

**భక్తుల రద్దీకి తగ్గట్టు ఆలయాల ఆధునీకరణ :** నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం రూ. 17.06 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరింది. కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల క్వార్టర్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. కుంతీ మాధవస్వామి ఆలయంలో కాలక్షేప మండపం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కుక్కుటేశ్వర స్వామి ఆలయానికి రూ. 5 కోట్లు, శ్రీపాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి.

పునరుద్ధరణ జరుగుతున్న ఆలయాల్లో శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పిఠాపురంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన 10వ శతాబ్దం నాటి కుంతీమాధవ స్వామి ఆలయంతో పాటు, పిఠాపురం మహారాజుల కాలం నాటి అనేక పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి.

పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ఏటా సుమారు 13.76 లక్షల నుంచి 18.07 లక్షల మంది భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. ఆయా పర్వదినాల్లో రోజుకు 20 వేల నుంచి ఏకంగా 50 వేల మంది వరకు భక్తులు తరలివస్తుంటారు. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు.

**అత్యాధునిక వసతులతో టీటీడీ కల్యాణ మండపం :** పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో గతంలో పాడా ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని అన్ని ఆధునిక వసతులతో పునర్నిర్మించారు. అలాగే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ మాడ వీధుల విస్తరణ పనులను విజయవంతంగా పూర్తి చేశారు.

ఇదే స్ఫూర్తితో ప్రస్తుతం యు.కొత్తపల్లి మండలంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిర్మాణానికి రూ. 2 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, ఇతర సామాజిక అవసరాలకు అనువుగా అత్యాధునిక వసతులతో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు.

**భజన మందిరాలతో పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ :** కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో 419 భజన మందిరాలను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.

ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో తొలి దశలో 48 భజన మందిరాల నిర్మాణానికి రూ. 11.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ భజన మందిరాలు కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా.. భజనలు, ఆధ్యాత్మిక సమావేశాలు, స్థానిక సాంస్కృతిక వేడుకలు, గ్రామస్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నారు.

మొత్తంగా రూ. 30.66 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణతో పాటు ఆలయాల ఆధునీకరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, గ్రామీణ సామాజిక వేదికల బలోపేతానికి దోహదపడనున్నాయి.

# ఏడుగురు మత్స్యకారులు క్షేమం



**అమరావతి, ఆగస్టు 26(జర్నలిస్ట్ ఫైల్):** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కావడం పట్ల వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో వారి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారని, వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ నెల 3న ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బోటులో సముద్ర వేటకు వెళ్లారని మంత్రి తెలిపారు. నిర్ణీత సమయంలో బోటు తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించి, మత్స్యకారుల ఆచూకీ కోసం ఎలాంటి ఆలస్యం చేయకుండా అన్ని విధాలుగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి చూపిన ప్రత్యేక చొరవ, శ్రద్ధ అభినందనీయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని, నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను కూడా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్ర అధికారులు, నేవీ, కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడినట్లు మంత్రి వెల్లడించారు.

మత్స్యకారుల ఆచూకీ కోసం సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, బోటు ఎలా తప్పిపోయింది, ఏ మార్గంలో ప్రయాణించి ఉండవచ్చు, ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉండే అవకాశం ఉందన్న అంశాలపై అన్నికోణాల్లో పరిశీలన జరిపామని మంత్రి తెలిపారు. బోటులో సాంకేతిక సమస్య తలెత్తి ఉండే అవకాశం సహా ప్రతి అంశాన్ని నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయంతో పరిశీలించామని చెప్పారు. గాలి దిశ, వేగం, సముద్ర ప్రవాహాలు, బోటు డ్రిఫ్ట్ అయ్యే అవకాశం వంటి అంశాలను కూడా శాస్త్రీయంగా విశ్లేషించి, బోటు పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండవచ్చన్న అంచనాతో ఆ ప్రాంతంలోని కోస్ట్‌గార్డ్ యూనిట్లు, స్థానిక మత్స్యకారులను అప్రమత్తం చేశామని మంత్రి తెలిపారు. ఈ సమన్వయ కృషి ఫలితంగానే శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బోటును గుర్తించి, అందులోని ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించగలిగామని చెప్పారు. బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్‌తో మాట్లాడి ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో క్షేమంగా ఉన్న విషయాన్ని నిర్ధారించుకున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారని, వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడించామని చెప్పారు. మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

ఈ గాలింపు చర్యల్లో రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, ూూ ౼+ూ, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేశాయని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్, జాయింట్ డైరెక్టర్, అల్లవరం ఖీణూతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన కృషిని మంత్రి అభినందించారు. మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూపిన ప్రత్యేక శ్రద్ధకు ధన్యవాదాలు. మత్స్యకారుల ఆచూకీ కోసం మొదటి నుంచి చివరి వరకు ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించింది. ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారనే శుభవార్త రావడం ఎంతో సంతోషంగా ఉంది అని మంత్రి అన్నారు. మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. మత్స్యకారులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# బస్సు.. లారీ ఢీ! ఆరుగురి మృతి



**కోదాడ (జర్నలిస్ట్ ఫైల్) :** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు.

**కోదాడ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు విచారం :** తెలంగాణ రాష్ట్రంలోని కోదాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు–కంటైనర్ ఢీకొనడంతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన పలువురు మృతి చెందగా... మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదానికి సంబంధించిన సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించేలా తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.




## గోదారమ్మ సందడి మొదలు



**అమరావతి, ఆగస్టు 26(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా, గోదావరి జలాలు ఎడమ కాలువ ద్వారా తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు ప్రవహించనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక సవాళ్లను అధిగమించి, పనులను వేగవంతం చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మురారి, మల్లేపల్లి, బూరుగుపూడి, ప్రత్తిపాడు, చెందుర్తి, కత్తిపూడి, బెండపూడి, ఆరెంపూడి, గవరయ్య కోనేరుల వద్ద జాతీయ రహదారి దాటనుంది.

ఆరెంపూడి, బెండపూడి వద్ద వంతెనలు, ఓ వైపు 500 మీటర్ల చొప్పున 1,000 మీటర్ల అప్రోచ్ నిర్మాణం పూర్తయ్యింది. మంగళవారం ట్రాఫిక్‌ను మళ్లించారు. ఆయాచోట్ల ప్రధాన రహదారి తవ్వకం పనులు చేపడుతున్నారు. ఈ పనులు గురువారం నాటికి పూర్తవుతాయని, అనకాపల్లి జిల్లాకు నీరు వెళ్లేందుకు మార్గం సుగమమైందని అధికారులు తెలిపారు. ఐదారు రోజుల్లో కాలువలో గోదారమ్మ సందడి చేయనుంది. ఇప్పటికే నీటి ప్రవాహం మొదలైందని, బుధవారం సాయంత్రానికి రావికంపాడు వద్దకు చేరుతుందని ఈఈ గోవింద్ పేర్కొన్నారు. అక్కడి నుంచి క్రమంగా (సుమారు 1,000–1,500 క్యూసెక్కులు) నీరు పాయకరావుపేట మీదుగా అనకాపల్లి జిల్లాకు వెళ్లనుంది.

**అనకాపల్లిలో 1.50 లక్షల ఎకరాలకు నీరు :** ప్రతిష్ఠాత్మకంగా జరిగిన పనుల్లో అనేక సవాళ్లను అధిగమించారు. తొమ్మిది చోట్ల జాతీయ రహదారిని దాటి కాలువ ముందుకు సాగింది. అన్నవరం పంపా జలాశయం, తుని పట్టణ పరిధిలో తాండవ నది పరీవాహక ప్రాంతంపై అక్విడక్టులు నిర్మించారు. కుమ్మరిలోవ వద్ద రెండు కొండలను తొలుచుకుంటూ కాలువ నిర్మాణం జరిగింది. పంపా, ఏలేరు రిజర్వాయర్ల పరిధిలో ఆయకట్టుకూ నీరు అందే పరిస్థితులు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 1.15 లక్షలు, కాకినాడలో 1.21 లక్షలు, అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాలకు నీరందనుంది. సాగునీటికి 84.808 టీఎంసీలు, తాగు అవసరాలు, పరిశ్రమలకు 23.44 టీఎంసీలను సర్కారు కేటాయించనుంది.

**పోలవరం చుట్టుపక్కల రహదారుల అభివృద్ధి :** పోలవరం ప్రాజెక్టు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచడానికి రూ.840 కోట్లతో ఆమోదం తెలిపినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఎన్‌హెచ్–365 బీబీ సెక్షన్‌లో ఉన్న బుట్టాయగూడెం – ఎల్ఎన్‌డీపేట మధ్య 45.09 కిలోమీటర్ల రహదారిని ఉన్నతీకరించడంతో పాటు పట్టిసీమ – కొవ్వూరు రహదారిని పేవ్‌డ్ షోల్డర్స్ సౌకర్యంతో రెండు వరుసలుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## నోటీసుల పంపిణీ 98.20% పూర్తి



**అమరావతి, ఆగస్టు 26(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ దాదాపు పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఈ నెల 26 నాటికి పురోగతి వివరాలను బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 44.28 లక్షల నోటీసులు పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 43.49 లక్షలు (98.20 శాతం) పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా 79 వేల నోటీసులు (1.80) పంపిణీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. పంపిణీ చేసిన 43.49 లక్షల నోటీసులకు ఇప్పటి వం-కు 14.64 లక్షల విచారణలు (33.67) పూర్తయ్యాయని తెలిపారు. ఫారం–6కు సంబంధించి 1.97 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం–7లో 5,081, ఫారం–8లో 1.38 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బిఎల్ఓతో కాల్ బుకింగ్‌కు సంబంధించి 911 కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

# నిందితులకు శిక్ష పడేలా పకడ్బందీగా చార్జ్‌షీట్లు జిల్లా ఎస్పీ



- పెండింగ్ గ్రేవ్ కేసులపై కొరడా
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా.

**వికారాబాద్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా లో హత్యలు, అత్యాయత్నం, అత్యాచారాలు, దొంగతనాల, కేసులపై వికారాబాద్ జిల్లా ఎస్పీ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో గ్రేవ్ క్రైమ్ కేసుల దర్యాప్తులో దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో గ్రేవ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన గ్రేవ్ కేసుల ఫైళ్లను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా కేసుల్లో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు పురోగతి, సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, నిందితుల గుర్తింపు, అరెస్టులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రతి గ్రేవ్ కేసులో దర్యాప్తు అధికారులు అన్ని కోణాలను పరిశీలించాలని జిల్లా ఎస్పీ సూచించారు. శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా సేకరించి, ఎలాంటి జాప్యం లేకుండా దర్యాప్తును పూర్తి చేయాలని ఆదేశించారు. నిందితులకు చట్టప్రకారం శిక్ష పడే విధంగా కేసుల్లో ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని స్పష్టం చేశారు. కేసు దర్యాప్తులో నేరాలు, నేరస్థుల వివరాల ఆన్‌లైన్ పోలీసు నెట్‌వర్క్ వ్యవస్థ ప్రతిష్ఠాత్మకంగా వివరాలు సేకరించాలి. ఎలక్ట్రానిక్ సాక్ష్యాల నమోదు, ఫోన్ కాల్స్‌కు సంబంధించిన వివరాలు సేకరించాలి. ఇంటర్నెట్ వినియోగం డేటా కనెక్షన్‌కు సంబంధించిన వివరాలు సీసీటీవీ ఫుటేజీ, డిజిటల్ ఆధారాలు తదితర సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైన మేరకు వినియోగించాలని సూచించారు. నేరస్థుల పరిశీలన, సాక్షుల విచారణ, ఫోరెన్సిక్ ఆధారాల సేకరణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ క్రైమ్ కేసులను ప్రాధాన్యతా క్రమంలో తీసుకుని, ప్రతి కేసులో తదుపరి దర్యాప్తు చర్యలకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తులో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, అవసరమైన సాంకేతిక, న్యాయపరమైన సహకారంతో కేసులను పరిష్కరించాలని ఎస్పీ సూచించారు.కోర్టు ట్రయల్‌కు వెళ్లే కేసుల్లో నాణ్యమైన చార్జ్‌షీట్లు సిద్ధం చేయడం, కోర్టు సమన్లు, వారెంట్ల అమలు, సాక్షుల హాజరు, ప్రాసిక్యూషన్ విభాగంతో సమన్వయం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ తెలిపారు.ప్రతి గ్రేవ్ క్రైమ్ కేసుల ను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టాలి. నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడే విధంగా కేసులను పకడ్బందీగా దర్యాప్తు చేయాలి అని ఎస్పీ స్నేహ మెహ్రా అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, డీసీఆర్‌బీ. డీఎస్పీ జానయ్య, జిల్లా పోలీస్ శిక్షణ డిఎస్పి శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బాల కార్మిక రహిత మండలంగా తీర్చిదిద్దాలి

- మారేడ్ పల్లి మండలంలో 180మంది పిల్లలు బడికి దూరం
- వారిని బడులలో చేర్పించాలి : సీఆర్పీఎఫ్‌కో కన్వీనర్ కే రమాదేవి



**అడ్డగుట్ట, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మారేడ్ పల్లి మండల పరిధిలోని డా బాబు జగ్జీవన్ రామ్ భవనంలో మంగళవారం జరిగిన బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కో కన్వీనర్ కే. రమాదేవి హాజరై మాట్లాడుతూ మన మండలంలో ఇంకా 180 మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారని తెలిపారు. వారిని బడిలో చేర్పించి విద్యను అందించి ఈ మండలాన్ని బాలకార్మిక రహిత మండలంగా తిర్చీ దిద్దాలని కోరారు. అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఉన్న తహాశీల్దార్ కార్యాలయాన్ని తక్షణమే ఎత్తివేయాలని కోరారు. సీతాపల్ మండి ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన నిధులను తక్షణమే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని ఎడల పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ పి.ఎల్ ప్రవీణ్ కుమార్, సీపీఐ పార్టి సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, సమ్మయ్య , బన్నప్ప, బాస్కర్, ఎంవీ.ఫౌండేషన్ ఆర్గనైజర్స్ ఏ.సువర్ణ, లత, సౌజన్య, లావణ్య, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## మైసిగండి తీజ్ పండుగకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**కడ్తాల్ ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో బుధవారం నిర్వహించనున్న తీజ్ మొలకల పండుగకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని గ్రామ సర్పంచ్ ప్రేమ జవహర్‌లాల్ నాయక్, ఉపసర్పంచ్ హీరాసింగ్ నాయక్ ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి పండుగ కార్యక్రమానికి హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.గిరిజన సంప్రదా యాలు,సంస్కృతి, ఆచారాల ను ప్రతిబింబించే తీజ్ పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు. మహిళలు, యువత, గ్రామ స్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండు గను విజయవంతం చేయా లని కోరారు.ఎమ్మెల్యేను ఆహ్వానిం చిన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, తులసీరాం నాయక్, రాము నాయక్,సాయి కుమా ర్ నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఆపన్నహస్తం.. నరేష్ కుటుంబానికి గణేష్ గౌడ్ భరోసా

- ప్రమాద బాధిత రేపని నరేష్ కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం
- ఆపదలో అండగా నిలవడమే నిజమైన మానవత్వమన్న గణేష్ గౌడ్



**కడ్తాల్ ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** కష్టాల్లో ఉన్న కుటుంబానికి తన వంతు భరోసా కల్పిస్తూ రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల బీసీ సంఘం అధ్యక్షుడు,కడ్తాల్ 9వ వార్డు సభ్యుడు మాదారం గణేష్ గౌడ్ మానవత్వాన్ని చాటుకున్నారు. గతంలో జరిగిన ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేపని నరేష్ కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఆపదలో ఉన్నప్పుడు పలకరించే మాట కంటే.. అవసరమైన సమయంలో అందించే చేయూతే ఆ కుటుంబానికి కొండంత ధైర్యాన్ని ఇస్తుందని గణేష్ గౌడ్ అన్నారు.ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేర సహాయం అందించాలని కోరారు.తాను అందించిన సాయం పెద్దది కాకపోయినా.. బాధిత కుటుంబానికి కొంతైనా ఊరట కలిగించాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. మాటల్లో కాదు చేతల్లో చూపించడమే మానవత్వం అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మాజీ గౌరవ అధ్యక్షుడు వరికుప్పల రాజు,హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,నార్లకంటి శేఖర్,చెన్న వెంకటేష్,శశాంక్ తదితరులు పాల్గొన్నారు.బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గణేష్ గౌడ్‌ను పలువురు అభినందించారు.

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు లయన్ డా.ఇ.ఎస్.ఎస్. నారాయణ మాస్టర్



**హైదరాబాద్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, ఉపాధ్యాయ రత్న రాష్ట్రస్థాయి, అక్షర బ్రహ్మ పురస్కారాలు-2026 ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డా.ఇ.ఎస్.ఎస్. నారాయణ మాస్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా బోధనతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళలు, క్రీడలు, యోగా రంగాల్లో సేవలందిస్తున్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హతలు, బోధన-శిక్షణ అనుభవాలు, సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికా క్లిప్పింగ్స్, గతంలో పొందిన అవార్డుల వివరాల జిరాక్స్ కాపీలతో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జతచేసి ఆగస్టు 28 లోపు పంపించాలని కోరారు. దరఖాస్తులను 'ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ', డోర్ నెం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు: తిరుమలగిరి, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపించాలని తెలిపారు. అవార్డుల ప్రదానోత్సవం సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర పూర్తి వివరాలకు ఫోన్ : 9652347207ను సంప్రదించాలని తెలిపారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- కౌన్సిలర్ నేమూరి స్వప్న రాంప్రసాద్ గౌడ్



**శామీర్ పేట్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆలయాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని అలియాబాద్ 15వ వార్డు కౌన్సిలర్ నేమూరి స్వప్న రాంప్రసాద్ గౌడ్ కోరారు. అలియాబాద్ మున్సిపాలిటీ లాల్ గడి మలక్ పేట్ పరిధిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి కందాడి పాపిరెడ్డి గారి పేరుమీద ఆయన కుమారుడు కందాడి అంజి రెడ్డి రూ.51,000 విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని 15వ వార్డు కౌన్సిలర్ నేమూరి స్వప్న రాంప్రసాద్ గౌడ్ సహకారంతో ఆలయ కమిటీకి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు ముందుకు రావడం అభినందనీ యమని పేర్కొన్నారు. కందాడి కుటుంబం చేసిన ఈ విరాళం ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. దాతృత్వం చూపిన కందాడి అంజి రెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. అదేవిధంగా ప్రతి ఒక్కరూ కూడా ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## మొక్కలే భావితరాలకు జీవనాధారం

- విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాలి
- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: సర్పంచ్ బొప్పిడి గోపాల్



**కడ్తాల్ ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మొక్కల పెంపకంతోనే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని,సహజ వనరులను అందించగలమని రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు,రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ అన్నారు.వనమహోత్సవం--2026లో భాగంగా మంగళవారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో సర్పంచ్ గోపాల్ ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ.. పర్యా వరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని నిరంతరం సంరక్షించి చెట్లుగా పెంచినప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని అన్నారు.పచ్చదనం పెంపుతో పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు భావితరాలకు ఆరోగ్యకర మైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.సకాలంలో వర్షాలు కురవాలన్నా,భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండాలన్నా, ప్రకృతి సమతుల్యత కొనసాగాలన్నా మొక్కల పెంపకం ఎంతో అవసరమని గోపాల్ అన్నారు.ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలు,ఖాళీ స్థలాలు,ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ఉద్యమంగా కొనసాగించాలని,గ్రామ ప్రజలంతా భాగస్వాములై రావిచేడ్‌ను పచ్చదనంతో నింపాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య,మాజీ ఎంపీటీసీ యాదయ్య,నాయకులు బాలకృష్ణ, రమేష్,సాయికుమార్,రాజయ్య, దేవేందర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణి

- పేద విద్యార్థులకు అండగా నిలవాలి
- మండల విద్యాధికారి రవిందర్ రాజు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని మండల విద్యాధికారి రవిందర్ రాజు అన్నారు. యూత్ ఫర్ సేవా,ఓ సాఫ్ట్వేర్ సంస్థ ఆధ్వర్యంలో కూకట్ పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ చేశారు.బుధవారం ఉదయం పాఠశాల ఆవరణలో కూకట్ పల్లి మండల విద్యాధికారి రవీందర్ రాజు ఆధ్వర్యంలో సుమారు 400 విద్యార్థులకు బ్యాగులను అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ రవీందర్ రాజా మాట్లాడుతూ పేద మధ్యతరగతి చెందిన విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాల విద్యార్థులకు చేయితనందించడం అభినందనీయమన్నారు. యూత్ సామాజిక సేవా కార్యక్రమంలో ముందుండి పేద విద్యార్థులకు అండగా నిలవాలని ఆయన కోరారు. స్వచ్ఛంద సంస్థల అందించే సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవ ప్రతినిధులు, సాఫ్ట్ ప్రతినిధులు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్కందరిగి హిల్స్ పార్క్‌లో ఉత్సాహంగా వన మహోత్సవం

- మొక్కలు నాటిన సిఐ, కాలనీ వాసులు



**బన్సీలాల్ పేట్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** సికింద్రాబాద్ పద్మారావు నగర్ స్కందరిగి హిల్స్ పార్క్ లో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.ఈ కార్యక్రమానికి చిలకలగూడ సిఐ రామక్రిష్ణ,స్కందరిగి ఆలయ పూజారులు ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలను నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు పాటుపడాలన్నారు.అందుకోసం విధిగా ప్రతి వ్యక్తి మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమం చేస్తున్న కాలనీ అధ్యక్షులు ఎంఎన్ఆర్ ను సిఐ రామకృష్ణ అభినందించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు రామచంద్ర రావు,ఆది సంతోష్, రాజీవ్ చౌదరి,రేవంత్,సిహెచ్ ప్రవీణ్,ప్రముఖ యోగగురు పోట్ల రామకోటేశ్వరరావు, స్కందగిరి పంతులు భరత్ ,నలిని చందన్,కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మైనంపల్లి ప్రత్యేక పూజలు

- శ్రావణ మంగళవారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



**మల్కాజ్‌గిరి, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రావణ మంగళవారం సందర్భంగా మల్కాజ్‌గిరిలోని వాసవి కన్యకాపర మేశ్వరి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మైనంపల్లి హనుమంతరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శ్రావణ మాసంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని మరింత పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మైనంపల్లి హనుమంతరావు ఆలయానికి రావడంతో నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో (ఎస్ ఐ ఆర్) పార్లమెంట్ ఇంచార్జ్ సుబ్రహ్మణ్యం శర్మ , అబ్జర్వర్ సమీర్ కౌశల్, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, టీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, జీడి చరణ్‌జిత్ గౌడ్, పార్థు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**రాంగోపాల్ పేట్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం రాంగోపాల్ పేట డివిజన్ లోని సింధి కాలనీలో గల వెంకట్రావ్ పార్క్ లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం కాలనీ వాసులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్క్ లో తిరిగి పరిశీలించారు. పార్క్ లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. పచ్చదనం పెరిగితే కాలుష్య నియంత్రణ జరిగి ఆరోగ్య వంతమైన జీవితాన్ని గడపగలమని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీటర్లు ఉన్నదని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత హరితహారం అనే కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, రహదారుల వెంట, ప్రభుత్వ ఖాళీ స్థలాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరిగిందని వివరించారు. ఫలితంగా 2021 నాటికి 21,214 చదరపు కిలోమీటర్ల కు పెరిగిందని చెప్పారు. భవిష్యత్ తరాలకు మనం ఇవ్వాల్సింది ఆస్తులు, అంతస్తులు కాదని ఆరోగ్యవంతమైన జీవితమని అని అన్నారు. కార్యక్రమంలో కవాడిగూడా సర్కిల్ ఐజ పుష్పలత, హార్టికల్చర్ ఐఐ చంద్రశేఖర్, సత్యనారాయణ, చాజు చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, రాంగోపాల్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, అరుణ్ భట్, గణేష్, కోటేశ్వర్ గౌడ్, దీపక్ గుప్త, చంద్ర ప్రకాష్ , కాలనీ వాసులు ప్రవీణ్, పత్తిపాక సంజయ్ తదితరులు ఉన్నారు.

## నేరేడ్‌మెట్‌లో (ఏం ఎస్ ఏం ఈ) పథకాలపై అవగాహన సదస్సు

- యువతకు స్వయం ఉపాధి, పారిశ్రామిక అవకాశాలపై మార్గదర్శకత్వం



**మల్కాజ్‌గిరి ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజ్‌గిరి నేరేడ్‌మెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల (ఆర్ ఏ ఎం పి) పథకం ఆధ్వర్యంలో (ఎం ఎస్ ఎం ఈ) పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలు, రాయితీలు, ఆర్థిక సహాయం, అవకాశాలపై స్థానిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు అవగాహన కల్పించారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు స్వయం ఉపాధి, పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ముందుకు సాగేందుకు అర్ ఏ ఏం పి పథకం, ఎన్ ఐ ఎం ఎస్ ఏం ఈ , జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.ఏం ఎస్ ఏం ఈ రంగానికి అవసరమైన సమాచారం, ప్రభుత్వ పథకాలు, రాయితీలు, బ్యాంకింగ్ సదుపాయాలు, మార్గదర్శకత్వాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాల సృష్టితో పాటు స్థానిక ఆర్థికాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యమని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో ఏం ఎస్ ఏం ఈ రంగాన్ని బలోపేతం చేసి యువతకు కొత్త అవకాశాలు కల్పించేందుకు ఈ అవగాహన సదస్సు కీలక ముందడుగు అని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ ఐ ఏం ఎస్ ఏం ఈ) సంచాల కులు సూర్య ప్రకాష్ గౌడ్, జిల్లా పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు జయంతి, సహాయ అధ్యా పకులు తేజేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు బద్దం పరశురామ్‌రెడ్డి, జికె హనుమంతురావు, జేఏసీ వెంకన్న, డోలి రమేష్ , శ్రీధర్ గౌడ్, రాము యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కన్నబాబు, ఈ డి సి సిబ్బంది, బ్యాంకర్లు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యా వరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### - వన మహోత్సవంలో మొక్కలు నాటిన ప్రభుత్వ విప్.
### - ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య.



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం తిరుమలాపురం గ్రామంలో మంగళవారం రోజు నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమం లో ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య పాల్గొని ఉపాధి హామీ కూలీలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామంలో పచ్చదనం పెంపొందిం చేందుకు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం తో పాటు వాటి సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు , గ్రామ ప్రజలకు సూచించారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా వాటిని క్రమం తప్పకుండా సంరక్షించి , పెరిగే వరకు బాధ్యత తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం పర్యావరణ పరి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత గా మారిందని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. చెట్ల సంఖ్య పెరిగితే వాతా వరణ కాలుష్యం తగ్గడం తో పాటు స్వచ్ఛమైన గాలి , ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటు లోకి వస్తుందని తెలిపారు. చెట్లు మానవ జీవనానికి ఎంతో కీలకమని , భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతా వరణాన్ని అందించాలంటే ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సం రక్షించాలని పిలుపు నిచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధి , పచ్చదనం పెంపు వంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు. గ్రామాల్లో రహ దారుల వెంట , ప్రభుత్వ స్థలాల్లో , పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడం మన బాధ్యత.. వాటిని సంరక్షించడం మన కర్తవ్యం. పచ్చదనం పెంచి పర్యావరణాన్ని కాపాడితేనే ఆరోగ్య కరమైన సమాజాన్ని నిర్మించగలం" అని బీర్ల అయిలయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు , అధికారులు , ఉపాధి హామీ సిబ్బంది , కూలీలు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పచ్చని పల్లెలే లక్ష్యంగా వనమహోత్సవ కార్యక్రమం..



**ఆత్మకూరు (ఎం) ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాలను పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో వనమహోత్సవం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు, రాయిపల్లి, సర్వేపల్లి గ్రామాల్లో మొక్కలు నాటారు. ఎంపీడీఓ రాములు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మి, రాయిపల్లి సర్పంచ్ అంజయ్య, సర్వేపల్లి ఉపసర్పంచ్ వెంకటేష్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాములు నాయక్ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందితేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, గ్రామాలను హరిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

### ఎల్‌నినో ప్రభావాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై
## రైతులకు అవగాహన కల్పించిన ఎంఎఓ ఋష్యేంద్రమణి



**మిర్యాలగూడ, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో రైతులకు ఎల్‌నినో ప్రభావాలు, భూగర్భజలాల తగ్గుదల మరియు నీటి లభ్యతపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయాధికారి మేకల ఋష్యేంద్రమణి నిర్వహించారు. ఇకపై వరి నాట్లు వేయకుండా, తక్కువ నీటితో సాగు చేసుకునే ప్రత్యామ్నాయ పంటలైన కంది, పెసలు, మినుములు, జొన్న, సజ్జ, రాగులు, నువ్వులు, ఆముదం తదితర పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. భూగర్భ జలాలను పరిరక్షించుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. ఏఇఓ గోపి రైతులకు పంటల ఎంపిక, నీటి సంరక్షణ ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు చేశారు.కార్యక్రమంలో రైతులు నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

## మిర్యాలగూడ పట్టణ అభివృద్ధిపై మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం

### - పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్




**మిర్యాలగూడ, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లతో మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. పట్టణంలో మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, రహదారులు, డ్రైనేజీ తదితర ప్రజా అవసరాలపై ప్రత్యేకంగా చర్చించి, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మిర్యాలగూడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టి, వాటి అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ, మిర్యాలగూడను మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ట్రస్మ జిల్లా కోశాధికారి వంగూరు పండుకు ఘన సన్మానం




**వలిగొండ, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** పోచంపల్లి పట్టణానికి చెందిన కృష్ణవేణి స్కూల్ కరస్పాండెంట్ పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షునిగా ఎన్నికైనందున యాదాద్రి జిల్లా ట్రస్మ ఘనంగా సన్మానించింది. భువనగిరి పట్టణంలోని. కాకతీయ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి పాలకూర వెంకటేశం గౌడ్, దాసరిశ్రీ రాములు , రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, మల్లికార్జున్, కాసుల వెంకటేశం, జిల్లా నాయకులు ఉగాది సోమిరెడ్డి తుంగతుర్తి రంగారావు, నరేందర్, దుర్గాప్రసాద్, కృష్ణంరాజు విజయలక్ష్మి, సంతోషి , రఘు అఖిల పాల్గొన్నారు.

# ఆయకట్టుకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### ● జిల్లా కలెక్టర్లను ఆదేశించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి నిర్దేశిత ఆయ కట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడ మే ప్రభుత్వ లక్ష్యమని , ఇందుకోసం ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ , పునరా వాసం--పునరావాస పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్) , అటవీ సమస్య లను వేగవంతంగా పరిష్కరించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. మంగళ వారం రోజు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ , ఆర్ అండ్ ఆర్ సమస్యలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వ హించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పూర్తి , నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందించడం పై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆమోదంతో ఇటీవల సుమారు రూ. 2,800 కోట్ల నిధులు విడుదల చేసి నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రూ. 1,080 కోట్లు జిల్లా కలెక్టర్ల పీడీ ఖాతా లకు చేరాయని , అవసర మైతే మరో రూ.6 వేల కోట్లను ఒకేసారి విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టుల వారీగా అవసరమైన భూసేకరణ , పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్ ఆర్ చెల్లింపులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే 45 రోజుల్లో అన్ని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ , ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భూ సేకరణను చీఫ్ ఇంజినీర్లు ఒక సవాల్‌గా తీసుకుని యుద్ధప్రాతిపదికన పని చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతి నిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించిన టోకెన్లను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు భూ సేకరణ అవార్డులను వీలైనంత త్వరగా ఆమోదించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు , కాలువల నిర్మాణంలో భాగంగా సేకరించిన భూముల యజమానులకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి , ఇరిగేషన్ యస్. ఈ రవీందర్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# ప్రమాదకర కర్మాగారాల్లో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలి

### ● అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా: జిల్లాలోని ప్రమాదకర కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలను పకడ్బందీ గా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మంగళ వారం రోజు కలెక్టరేట్‌లోని వీసీ మీటింగ్ హాల్‌లో ఫ్యాక్టరీస్ , కాలుష్య నియంత్రణ మండలి , కార్మిక శాఖ , ఫైర్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ రసాయన , ఔషధ పరిశ్రమల్లో ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాల కారణంగా విలువైన మానవ ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ , ఇటువంటి సంఘట నలు పునరావృతం కాకుండా పరిశ్రమల యాజ మాన్యాలు ముందస్తు భద్రతా చర్యలను కట్టు దిట్టంగా చేపట్టాలని సూచించారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని , భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.



జిల్లాలోని అన్ని ప్రమాదకర కర్మాగారాల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ కన్సల్టెంట్ ద్వారా భద్రతా ధృవీకరణ పొందేలా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత కర్మాగారాల యాజ మాన్యాలు తమ పరి శ్రమల్లో గుర్తించిన భద్రతా లోపాలపై చేపట్టిన చర్యలకు సంబంధించిన కంప్లైంట్స్ రిపోర్ట్ ను 10 రోజుల్లోగా సమర్పించేలా చూడాలని ఆదేశించారు.పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించగా గుర్తించిన లోపాలను యాజ మాన్యాలు తక్షణమే సరి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఫ్యాక్టరీల్లో డ్రైర్లు , రియాక్టర్లు , పేలుడు ఉపశమన ప్యానెల్స్ , భద్రతా వాల్వులు తదితర భద్రతా పరికరాలు తప్పని సరిగా ఏర్పాటు చేసి , అవి సక్రమంగా పని చేస్తున్నాయో నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని రసాయన పరి శ్రమల్లో వారం రోజుల్లోగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నమూనాలు సేకరించి , సంబంధిత ప్రమాణాల ప్రకారం పరీక్షలు నిర్వ హించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనలు , కాలుష్య నియంత్రణ ప్రమాణాలు కచ్చితంగా అమలయ్యేలా పిసిబి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిశ్రమల యాజమాన్యాలు నిబంధ నలను తప్పనిసరిగా పాటిస్తూ కార్మికులు , పరిసర ప్రాంత ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు , కార్మికుల ప్రాణ రక్షణ విషయంలో ప్రభుత్వం ఎట్టి పరి స్థితుల్లోనూ రాజీపడదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి , డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి , జిల్లా పరిశ్రమలు అధికారి రవీందర్ , సంబంధిత శాఖల అధికారులు , పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం ప్రత్యేక ఓటీల ఏర్పాటు..

### ● క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం సంగ్య తండా పరిధిలో మల్లన్నసాగర్ 15వ , 16వ ప్యాకేజీలకు సంబంధించి కొండాపూర్ వద్ద కొండ పోచమ్మ ప్రాజెక్టు నుంచి వచ్చే ప్రధాన కాల్వను ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య మంగళవారం రోజు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాల్వకు దిగువన ఉన్న గ్రామాలు , చెరువులు , ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసు కుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంబంధిత ఇరిగేషన్ అధికారులతో కలిసి కాల్వ ప్రాంతాన్ని పరిశీలించి , రైతులకు నీరు అందించడంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ప్రజలకు , రైతులకు ఇబ్బందులు కలగకుండా, అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ దిగువ ప్రాంతాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదే శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం రైతుల సంక్షే మానికి , సాగునీటి సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్య మంత్రి నాయకత్వంలో సాగునీటి వనరులను అభివృద్ధి చేసి , రైతుల పొలాలకు నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బస్వాపూర్ ప్రాజెక్టుతో పాటు , గంధమల్ల ప్రాజెక్టు ల నిర్మాణం పూర్తయితే దిగువ ప్రాంతాల్లోని వేలాది ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు, ఆయా ప్రాంతాలు సస్య శ్యామలం అవుతాయని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. అందుకు బస్వాపూర్ భూ బాధితు లకు నష్టపరిహారం , అదే విధంగా గంధం వల్ల భూ భాధితులకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందజేసి ప్రారంభిస్తామన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల్లో కాల్వలకు ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేసి అనేక చెరువులను నీటితో నింపగలిగామని ఎమ్మెల్యే తెలిపారు. బస్వాపూర్ వైపు వెళ్లే కాల్వలో మరో రెండు ప్రత్యేక ఓటీలను ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 70 నుంచి 80 చెరువులకు నీటిని అందించే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఓటీల ఏర్పాటు పూర్తయి తే దిగువ ప్రాంతాల్లోని చెరువులు నిండడంతో భూగర్భ జలాలు పెరిగి , రైతులకు సాగునీటి లభ్యత మరింత మెరుగు పడుతుందని తెలిపారు. ఇరిగేషన్ శాఖ అధికారులు , ఎస్ఈ , డీఈ , ఇతర సాంకేతిక సిబ్బంది సహకారంతో అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఓటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడు తున్నామని బీర్ల అయిలయ్య వెల్లడించారు. సాగునీటితో పాటు ప్రతి ఇంటికి తాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. షామీర్‌పేట్ మండలం ఘన్‌పూర్ వద్ద రూ.210 కోట్లతో నిర్మిస్తున్న మిషన్ భగీరథ కాలువ పనులను తాజాగా పరిశీలించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే నియోజక వర్గంలోని ప్రజలకు ప్రతిరోజూ ఎక్కువ పరి మాణంలో తాగునీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు , రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాల్వల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ ప్రాంతాలకు నీటిని అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

రైతుల పొలాలకు సాగునీరు అందించడం , చెరువులను నింపడం , నియోజకవర్గాన్ని సస్య శ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు.



# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- అలంపూర్, గద్వాల కోట, నిజాం కొండ అభివృద్ధికి చర్యలు
- పర్యాటకులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి
- బ్రాండ్ తెలంగాణను ప్రపంచస్థాయిలో బలోపేతం చేయాలి
- అదనపు కలెక్టర్ మధుమోహన్



**గద్వాల, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలోని అలంపూర్, నిజాం కొండ, గద్వాల కోట తదితర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ మధుమోహన్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి వర్షాభావ పరిస్థితులు, నీట్--పీజీ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. తెలంగాణను దేశ, విదేశీ పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతూ బ్రాండ్ తెలంగాణను ప్రపంచస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పారిశుద్ధ్యం, సూచిక బోర్డులు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రతి పర్యాటక ప్రాంతానికి స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణ, బాధ్యతలు, కాలపరిమితిని రూపొందించి పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు.

తెలంగాణ సంస్కృతి, కళలు, హస్తకళలు, చారిత్రక వారసత్వం, స్థానిక ఆహారం, పండుగలు, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా బ్రాండ్ తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సీఎస్ సూచించారు. ఫెయిర్లు, ఫెస్టివల్స్, వారసత్వ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. సమగ్ర తెలంగాణ పర్యాటక పోర్టల్, కృత్రిమ మేధ ఆధారిత ప్రయాణ ప్రణాళికలు, రియల్‌టైమ్ డేటా వ్యవస్థల ద్వారా పర్యాటకులకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల సహజ, చారిత్రక ప్రత్యేకతలను కాపాడుతూ పర్యావరణహితంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్--పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, జనరేటర్ బ్యాకప్, వెంటిలేషన్ తదితర సదుపాయాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అభ్యర్థుల గుర్తింపు, తనిఖీలను నిబంధనల ప్రకారం చేపట్టాలని, మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, ఏఐ గ్లాసెస్, స్పై కెమెరాలు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రత, గోప్యతకు పూర్తి రక్షణ కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 22 శాతం లోటు వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ నిపుణులు సూచించినట్లు సీఎస్ తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు, సాగునీరు, తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ మధుమోహన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులకు పర్యాటక అభివృద్ధి, నీట్--పీజీ పరీక్ష ఏర్పాట్లు, వర్షాభావ పరిస్థితులపై తగిన సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రామలింగేశ్వర గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## భాషా పునాదులు బలోపేతం చేయాలి

### :తాట్లవాయిలో తెలుగు ఉపాధ్యాయుల సమావేశం



**రాయికల్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**

విద్యార్థుల్లో కనీస భాషా సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పాఠశాలల్లో అమలు చేయాలని పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు బోగ రమేష్ సూచించారు. రాయికల్ మండలం తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాయికల్, మేడిపల్లి, భీమారం మండలాలకు చెందిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల తెలుగు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలుగును సరిగా చదవడం, రాయడంలో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం నేర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని సూచించారు.తెలుగు రిసోర్స్ పర్సన్ చెరుకు మహేశ్వర శర్మ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇది తొలి సమావేశమని తెలిపారు. అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారిలో భాషా నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అభ్యసన ఫలితాలు మెరుగుపడేలా తగిన వ్యూహాలు రూపొందించి వాటి అమలుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో తెలుగు ఉపాధ్యాయులు ఎస్. గంగరాజం, అలీరాజా, రత్తీలాల్, జి. శ్రీనివాస్, ఎస్. రజనీ, సంధ్యారాణి, రూపవతి, సరిత, కె.జ్యోతి, ఫిరోజ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కూతురిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన వార్డు సభ్యుడు



**రాయికల్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఇటిక్యాల గ్రామ వార్డు సభ్యుడు నిగ భూమేశ్వర్ ప్రభుత్వ బడిపై నమ్మకాన్ని చాటుకున్నారు. తన కుమార్తెను స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలిచారు.ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని భూమేశ్వర్ తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు విశ్వాసం ఉంచాలని పిలుపునిచ్చారు.తమ పాఠశాలపై నమ్మకంతో విద్యార్థినిని చేర్పించిన భూమేశ్వర్ కుటుంబాన్ని ప్రధానోపాధ్యాయులు సదాశివ్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినికి పుస్తకాలు అందజేశారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పిస్తే ప్రభుత్వ విద్య బలోపేతానికి మరింత ఊతం లభిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భూమేశ్వర్ నిర్ణయం గ్రామంలోని ఇతర తల్లిదండ్రులకు స్ఫూర్తిగా నిలుస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## 10 పోస్టులకు 175 దరఖాస్తులు

### :27 నుంచి అంగన్వాడీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

**రాయికల్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**




ఆగస్ట్25: అంగన్వాడీ టీచర్ పోస్టుల కోసం రాయికల్ మండలంలో పోటీ తీవ్రంగా ఉంది. మండలంలో ఖాళీగా ఉన్న 10 అంగన్వాడీ పోస్టులకు 175 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 27 నుంచి జగిత్యాలలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు సీడీపీవో జయప్రద తెలిపారు.
జగిత్యాల జిల్లాలో మొత్తం 22 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా, రాయికల్ మండలంలో 10 పోస్టులు ఉన్నాయి. వీటిలో 7 గ్రామీణ ప్రాంతాల్లో, 3 రాయికల్ మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నోటిఫికేషన్ వివరాలను సంబంధిత గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో సూపర్‌వైజర్లు అనూహ్య, పద్మావతి, రాధలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సర్పంచుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శులకు నోటిఫికేషన్ ప్రతులను అందజేసి, ముఖ్యమైన తేదీలపై అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగిత్యాల ఐసీడీఎస్ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌తో పాటు గెజిటెడ్ అధికారి సంతకం, స్టాంపుతో కూడిన జిరాక్స్ సెట్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని సీడీపీవో జయప్రద సూచించారు. నిర్ణీత గడువులోపు వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు.

## జాఫ్రాపూర్ లో వృద్ధుడు అదృశ్యం..

### మూడు రోజులైనా ఆచూకీ లేదు

**సోన్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**



సోన్ మండలం జాఫ్రాపూర్ గ్రామంలో 75 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన లోలం చిన్నయ్య, తండ్రి – లేట్ చిన్నయ్య, వయసు 75 సం., కులం – గొల్ల, గత మూడు సంవత్సరాలుగా వృద్ధాప్యం కారణంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వయసు పైబడటంతో మతిస్థిమితం కూడా సరిగా లేక ఇంటికే పరిమితమయ్యాడు. అయితే మూడు రోజుల క్రితం అనగా 22.08.2026 వ తేదీన కొడుకు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లు, పొలాల్లో గాలించినా ఎక్కడా జాడ కనిపించలేదు. చివరకు చేసేది లేక ఈ రోజు అనగా 25.08.2026న అతని కొడుకు లోలం సాయన్న సోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె. గోపి తెలిపారు.

వృద్ధుడి ఆనవాళ్లు

వయసు 75 ఏళ్లు, కొంచెం నెరిసిన జుట్టు, సన్నని శరీరాకృతి, తెలుపు పంచె, చొక్కా ధరించి ఉంటారు. వృద్ధాప్యం కారణంగా నెమ్మదిగా నడుస్తారు, మతిస్థిమితం సరిగా లేదు.
ఈ వృద్ధుడి ఆచూకీ ఎవరికైనా తెలిసినా, ఎక్కడైనా కనిపించినా వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు గానీ, సోన్ పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు, పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### గ్రామపంచాయతీ వద్ద

## ఇంకుడు గుంతల ఏర్పాటు



**సోన్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**

సోన్ మండలంలో పాకపట్ల గ్రామంలో వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాలను పెంచడానికి ఈ ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ తెలిపారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఇంకుడు గుంతల ఏర్పాటు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్చల్ శ్రీలత పంచాయతీ కార్యదర్శి వినయ్, పర్యవేక్షణలో గ్రామ సిబ్బంది ఈ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నారు.

## శిశు మరణాల తగ్గింపే లక్ష్యం.. అంకితభావంతో పనిచేయాలి

### -డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్

**నిర్మల్‌జిల్లా, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**

జిల్లాలో శిశు మరణాల రేటు (IMR), నవజాత శిశు మరణాల రేటు (NMR) తగ్గింపునకు వైద్య సిబ్బంది సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ సూచించారు.
జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మార్గదర్శకత్వంలో శిశు మరణాల నివారణ కోసం “అంకురం” కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి శిశు మరణాలను నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు.
ఆరోగ్యవంతమైన తల్లే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తుందని పేర్కొంటూ, గర్భధారణ ప్రారంభం నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అధిక ప్రమాద గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని చెప్పారు. ప్రసవం అనంతరం 42 రోజులపాటు తల్లి, శిశువు ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.






అనంతరం 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్రదానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించి, ఎక్కువ మంది నేత్రదానం చేసేందుకు ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.
కార్యక్రమంలో అంకురం కార్యక్రమం అమలు విధానం, ఆరోగ్య సిబ్బంది బాధ్యతలు, వివిధ స్థాయిల్లో చేపట్టాల్సిన చర్యలపై కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ సౌమ్య వివరించారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ పవన్, డాక్టర్ ఆకాష్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డీపీహెచ్ఎన్ఓ సాయమ్మ, ఆప్తాల్మిక్ అధికారి లక్ష్మీకాంత్, సామాజిక ఆరోగ్య అధికారులు, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సీఆర్ఆర్‌టీ వరం

### కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి

**జగిత్యాల, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**

అవయవాల పనితీరు దెబ్బతిని ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులకు కంటిన్యూస్ రీనల్ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్ (సీఆర్ఆర్‌టీ) ఆధునిక ప్రాణరక్షక చికిత్సగా నిలుస్తోందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సాధారణ డయాలసిస్‌ను తట్టుకోలేని అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఈ చికిత్స ఆశాకిరణంగా మారుతోందని వారు వెల్లడించారు.బుధవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో సీఆర్ఆర్‌టీ యంత్రం పనితీరు, వినియోగం, ప్రయోజనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యులు మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగుల్లో మూత్రపిండాల పనితీరు ఒక్కసారిగా దెబ్బతినడం సాధారణమేనని, అలాంటి సమయంలో సాధారణ డయాలసిస్‌ను తట్టుకునే పరిస్థితి చాలామందికి ఉండదని వైద్యులు తెలిపారు. అలాంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సీఆర్ఆర్‌టీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ అత్యాధునిక యంత్రం ద్వారా రోగికి అవసరమైన బీపీ మందులను కొనసాగిస్తూ 24 గంటలపాటు నిరంతరాయంగా డయాలసిస్ నిర్వహించవచ్చని వివరించారు. దీంతో శరీరంలోని వ్యర్థ పదార్థాలు, విషతుల్యాలు, అదనపు ద్రవాలు క్రమంగా తొలగిపోవడంతో రోగి శరీరంపై ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు.సీఆర్ఆర్‌టీ చికిత్స వల్ల గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి కీలక అవయవాలపై అదనపు భారం పడకుండా కాపాడటంతో పాటు అవి తిరిగి సాధారణ స్థితికి చేరుకునేందుకు అవకాశం పెరుగుతుందని వైద్యులు వెల్లడించారు. రోగి శారీరక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా చికిత్స అందించడం ఈ విధానంలోని ప్రత్యేకత అని తెలిపారు. దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు కోలుకునే అవకాశాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని చెప్పారు.కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో సీఆర్ఆర్‌టీ యంత్రాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ఇప్పటివరకు పలువురు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులను వైద్య బృందం సమిష్టి కృషితో కాపాడగలిగామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి సరైన చికిత్స అందించడం, నిపుణుల పర్యవేక్షణలో ఆధునిక వైద్య సాంకేతికతను వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా బహుళ అవయవాల పనితీరు దెబ్బతిన్న రోగుల చికిత్సలో సీఆర్ఆర్‌టీ




కీలకంగా మారిందని వివరించారు.ప్రజల్లో ఈ చికిత్స విధానంపై సరైన అవగాహన పెంపొందించడం కూడా అవసరమని వైద్యులు సూచించారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదిస్తే రోగిని కాపాడే అవకాశాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, చంద్రశేఖర్, మహేష్,అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల్లో ఆరోగ్య చైతన్యం

### ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన విస్డం విద్యార్థులు

**రాయికల్, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డా. శశికాంత్‌రెడ్డి, అనస్తీషియా వైద్యుడు డా. శ్రీకాంత్ సూచించారు. పట్టణంలోని విస్డం హైస్కూల్‌కు చెందిన ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. స్టూడెంట్ లెడ్ మూమెంట్ కార్యక్రమంలో భాగంగా ‘హెల్తీ లైఫ్‌స్టైల్’ అంశంపై విద్యార్థులు ప్రదర్శనలు, నినాదాలు, చర్చలు, నాటకాల ద్వారా అవగాహన కల్పించారు. ఆరోగ్యం అంటే కేవలం శారీరకంగా దృఢంగా ఉండటమే కాదని, మానసికంగా, బౌద్ధికంగా, ఆధ్యాత్మికంగా కూడా ఆరోగ్యంగా ఉండాలని వైద్యులు పేర్కొన్నారు. పరిసరాల్లో లభించే పండ్లు, కూరగాయలను ఆహారంలో తప్పనిసరిగా భాగం చేసుకోవాలని సూచించారు.
ప్రాథమిక విద్యార్థులు ఎలాంటి స్టేజ్ ఫియర్ లేకుండా మాట్లాడటం, పలు ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమని, వారికి శిక్షణ అందించిన పాఠశాల యాజమాన్యాన్ని వైద్యులు




అభినందించారు.
అనంతరం విద్యార్థులు వైద్యులు, సిబ్బంది, రోగులకు ముందస్తు రాఖీలు కట్టి “మేము మీకు రక్ష... మీరు మాకు రక్ష... మనందరం మత్తు పదార్థాలు లేని ఆరోగ్యవంతమైన భారతదేశానికి రక్ష” అంటూ సంకల్పం చేశారు. రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు.
పాఠశాల కరస్పాండెంట్ ఎ.ఎం. రాజు రెడ్డి మాట్లాడుతూ తరగతి గదుల్లో బోధించే పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా వివరించేందుకు ప్రతి సంవత్సరం ఎస్ఎల్ఎం, ఎస్ఎల్‌సీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.
ప్రాథమిక విద్య పటిష్టంగా ఉంటేనే విద్యార్థుల్లో సర్వాంగీణ వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డా. రజిత, డా. సుదక్షణాదేవి,డా.సాయి సుధా, డా.మానస,డా. అనిల్, డా.సింధూజ,డా. మణిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తా: మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

**రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ కమిటీ ప్రాథమిక సమావేశం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ కమిటీ చైర్మన్ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.
సమావేశంలో శాసనసభ, శాసనమండలికి చెందిన కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అనంతరం బీసీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కు ముఖ్య అతిథులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, తనను కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు




తెలిపారు. ఈ పదవిని కేవలం గౌరవంగా కాకుండా గొప్ప బాధ్యతగా భావిస్తున్నానని, చిత్తశుద్ధి, అంకితభావం, నిష్పక్షపాతంతో విధులు నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.
బీసీల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధి కోసం కమిటీ సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని వెనుకబడిన తరగతులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను గుర్తించి, సభ్యుల సహకారంతో ఆచరణాత్మకమైన, శాశ్వత పరిష్కారాలను కనుగొనడమే లక్ష్యమని తెలిపారు.ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించి వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేయడం, విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో ఉన్న లోపాలను గుర్తించడం, బీసీల సామాజిక, ఆర్థిక సాధికారతకు కొత్త చర్యలను ప్రభుత్వానికి సిఫార్సు చేయడం తమ ప్రధాన ప్రాధాన్యతలని వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా కృషి చేస్తామని మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తెలిపారు.

## అభివృద్ధి పనులకు వెంటనే అనుమతులు ఇవ్వాలి

**రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**

రామగుండం నగరంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు తక్షణమే సాంకేతిక, పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని నగర మేయర్ మహంకాళి స్వామి పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్‌ఇన్‌చీఫ్ వై. సాయపరెడ్డిని కోరారు.
మంగళవారం హైదరాబాద్‌లోని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ప్రధాన కార్యాలయంలో సాయపరెడ్డిని మేయర్ స్వయంగా కలిసి రామగుండం నగర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. యూఐడీఎఫ్ పథకం కింద రూ.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పలు రివైజ్డ్ అభివృద్ధి పనులకు సాంకేతిక అనుమతులతో పాటు పరిపాలనా మంజూరు ఇవ్వాలని కోరారు.
అదేవిధంగా డీఎంఎఫ్‌టీ నిధులు రూ.6.85 కోట్లతో ప్రతిపాదించిన నూతన జూనియర్ కళాశాల భవన నిర్మాణం, టీయూఎఫ్ఐడీసీ పథకం కింద రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు కూడా త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.
నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో కొంతకాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగేందుకు సహకరించాలని మేయర్ కోరారు. ఈ అంశాలపై ఇంజనీర్‌ఇన్‌చీఫ్ సానుకూలంగా



స్పందించినట్లు మేయర్ తెలిపారు.
పీఏసీ సమావేశంలో పాల్గొన్న మేయర్
అంతకుముందు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన రాజకీయ, సంస్థాగత అంశాలతో పాటు పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, నియోజకవర్గాల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు.
క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంచడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగిందన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించినట్లు మేయర్ తెలిపారు.
ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు, నాయకులు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, గంప వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆలయానికి భూమిపూజ



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):బి. మఠం మండలం రేకలకుంట పంచాయతీ వాంపల్లెచెరువు గ్రామంలో టీటీడీ నిధులతో సుమారు రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న శ్రీ వెంగమాంబ నూతన ఆలయానికి బుధవారం భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాన్ని గుర్తించి, ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగానే నేడు ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది.
ఎమ్మెల్యే ఆశీస్సులతో, బి. మఠం మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి గారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.
ఈ సందర్భంగా టీడీపీ కడప జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి బి. మఠం మాజీ మండల అధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వారం రోజుల్లో వీధి దీపాల ఫిర్యాదులు పరిష్కరించాలి



- అధికారులకు గుంటూరు నగర కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశం

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో వీధి దీపాలకు సంబంధించి ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. వీధి దీపాల నిర్వహణ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై బుధవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కాల్ సెంటర్, గ్రీవెన్స్ ద్వారా అందిన వీధి దీపాల ఫిర్యాదులను వార్డుల వారీగా కమిషనర్ సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి, రోజువారీగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఏఈ తమ పరిధిలోని వార్డుల్లో వెలగని వీధి దీపాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.
వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి అభ్యర్థనలు వచ్చిన ప్రాంతాల్లోనూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. విద్యుత్ స్తంభాలు లేని ప్రాంతాల్లో ఏపీసీపీడీసీఎల్ అధికారులతో సమన్వయం చేసుకుని నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సూచించారు.
రాత్రి వేళల్లో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నగరవ్యాప్తంగా వీధి దీపాలు నిరంతరం వెలిగేలా చూడాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అధికారులదేనని కమిషనర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
సమావేశంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ విష్ణు, డీఈఈ శ్రీనివాస్, ఏఈ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటు రాజకీయాలకు జగన్‌నే ప్రతిరూపం

- బీసీ రిజర్వేషన్లపై జగన్‌ది రాజకీయ మోసం
- కూటమిది చట్టబద్ధమైన సామాజిక న్యాయం
- స్థానిక సంస్థల ఎన్నికల ఓటమిపై జగన్‌లో అప్పుడే వణుకు: మంత్రి సత్యకుమార్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : వెన్నుపోటు, విశ్వాసఘాతుకం అంటూ ఇతరులకు నీతులు చెప్పడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తగదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. తన రాజకీయ చరిత్రను మర్చిపోయి ఇతరులపై నిందలు వేయడం జగన్ రాజకీయ కపటత్వానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు.
కుటుంబంలోనే తల్లి, సోదరితో బహిరంగంగా వెలుగుచూసిన విభేదాలు, బాబాయ్ హత్య కేసు చుట్టూ కొనసాగుతున్న పరిణామాలు ప్రజలకు తెలియని విషయాలు కావని సత్యకుమార్ అన్నారు. వాటిపై సమాధానం చెప్పకుండా ఇతరులకు నీతులు చెప్పడం జగన్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. వెన్నుపోటు అనే పదాన్ని పదేపదే ప్రస్తావించినంత మాత్రాన జగన్ గతం మారదని, చరిత్రను మైక్‌లతో మార్చలేరని, ప్రజల జ్ఞాపకాలను ప్రెస్‌మీట్‌లతో చెరిపేయలేరని వ్యాఖ్యానించారు.
ఇతరులకు నీతులు చెప్పే ముందు జగన్ తన రాజకీయ చరిత్రను ఒకసారి పరిశీలించుకోవాలని సత్యకుమార్ సూచించారు. జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ వ్యవహారంలోనూ జగన్ వైఖరిని ఆయన తప్పుబట్టారు.
**బీసీ రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం :** బీసీ రిజర్వేషన్ల విషయంలో జగన్ చేస్తున్న ప్రచారం ప్రజలను మరోసారి తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. రిజర్వేషన్లు ప్రకటించామని చెప్పుకోవడం కాదని, అవి న్యాయపరంగా నిలబడేలా చేయడమే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.
గత ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్ నిర్ణయం న్యాయపరమైన చిక్కుల్లో పడిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు రిజర్వేషన్లు చట్టబద్ధంగా, న్యాయపరంగా నిలబడేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.
బీసీలకు హక్కులు కల్పించడం, వారి ప్రాతినిధ్యాన్ని పెంచడం, గౌరవం కల్పించడం తమ ప్రభుత్వ బాధ్యత అని సత్యకుమార్ అన్నారు. గత ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని, ఎన్నికల సమయంలో వారి పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలను పాలనలో భాగస్వాములుగా చూస్తోందని తెలిపారు. ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని స్పష్టం చేశారు.
**స్థానిక ఎన్నికల ఓటమిపై జగన్‌లో ఆందోళన :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే ఆందోళన జగన్‌లో ఇప్పటి నుంచే కనిపిస్తోందని సత్యకుమార్ అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఎదురయ్యే ఓటమికి కారణాలను ఇప్పటి నుంచే వెతుక్కునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.
గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా కాకుండా కూటమి ప్రభుత్వ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయని మంత్రి తెలిపారు. ప్రజలు కూటమి ప్రభుత్వం వైపే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజల తీర్పు స్పష్టంగా వెల్లడవుతుందని సత్యకుమార్ పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల్లో కూటమికి మద్దతు ఇవ్వండి : ఎమ్మెల్యే నసీర్

- గుంటూరు నగర ప్రగతికి బాటలు వేద్దాం
- వైసీపీ పాలనలో కార్పొరేషన్ నిధులు దోచేశారు
- నియోజకవర్గంలో ఇప్పటికే రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం
- శ్రీనగర్ లో రూ.8:50 కోట్లతో డ్రైయిన్లు, రోడ్లు, పైపులైన్ల నిర్మాణానికి శంకుస్థాపన



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్ల కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, స్థానిక సంస్థల్లో కూటమిని బలపరిస్తే మరింత ప్రగతి సాధించే అవకాశం ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో 8:30 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తొలుత డొంక రోడ్డు నుంచి శ్రీనగర్ ఏడో లైన్ వరకు బైకులు, కార్లతో కూటమి నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీనగర్ లో రూ. 7 కోట్లు, వసంతరాయపురంలో రూ. 1.50 కోట్లతో సిసి రోడ్లు డ్రైన్లు పైపులైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతథ గత వైసీపీ పాలనలో కార్పొరేషన్ నిధులను దోచుకుతింటే.. తమ ప్రభుత్వంలో ప్రతి రూపాయిని ప్రజలకు జవాబుదారీగా పని చేస్తున్నామని తెలిపారు. కేవలం రెండేళ్లలోనే అద్భుతమైన ప్రగతి సాధించామని, స్థానిక సంస్థల్లో పూర్తిస్థాయి మెజారిటీ అందిస్తే రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మేలు చేసే అవకాశం కలుగుతుందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి కూటమి ప్రభుత్వానికి మద్దతు అందించాలని కోరారు. కార్పొరేషన్ లో కూటమికి తగినంత బలం చేకూరిస్తే గుంటూరు నగరానికి మహర్దశ వస్తుందన్నారు.. ఇప్పటికే అంతర్గత రోడ్లు, డ్రైన్, వాటర్ పైపులైన్లు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. నగరంలోని మురుగునీరు బయటకు పోయేందుకు డ్రైన్ల నిర్మాణం చేపట్టామన్నారు. 28 కిలోమీటర్ల మేర నూతన రోడ్లు నిర్మించామని తెలిపారు. నందివెలుగు రోడ్డు, కాకాని రోడ్డు, ఏటుకూరు రోడ్డు, సిఆర్ నగర్ వంటి ప్రాంతాల్లో డ్రెయిన్లు అనుసంధానం చేశామని చెప్పారు.
రాబోయే రోజుల్లో రూ. 200 కోట్ల నిధులు నగరాభివృద్ధికి రానున్నాయని, దీంతో గుంటూరు రూపురేఖలు మార్చబోతున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు.

## ఈఓ శంకర బాలాజీ హయాంలో అగస్త్యేశ్వరాలయంలో రూ.62 లక్షల గోల్‌మాల్?



ప్రొద్దుటూరు (జర్నలిస్ట్ ఫైల్): కడప జిల్లా ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరాలయంలో ఈఓగా శంకర బాలాజీ పనిచేసిన సమయంలో సుమారు రూ. 62 లక్షల మేర ఆర్థిక అవకతవకలు జరిగినట్లు దేవదాయశాఖ అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీనిపై నిర్వహించిన పరిశీలనకు సంబంధించిన నివేదికను ఈ నెల 17న ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. అగస్త్యేశ్వరాలయంలోనే భారీ మొత్తంలో అవకతవకలు వెలుగుచూడటంతో.. గతంలో శంకర బాలాజీ ఈఓగా పనిచేసిన ఇతర ఆలయాలపైనా ఇప్పుడు చర్చ మొదలైంది. ఆయన ప్రొద్దుటూరు గీతాశ్రమం బ్రహ్మంగారిమఠం అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయాలతో పాటు మరికొన్ని ఆలయాలకు ఈఓగా పనిచేశారు. అనంతరం జిల్లా సహాయ కమిషనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు.

**ఇతర ఆలయాల్లోనూ..**

అగస్త్యేశ్వరాలయంలో రూ. 62 లక్షల మేర అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించిన నేపథ్యంలో.. ఆయన గతంలో పనిచేసిన ఆలయాల్లోనూ నిధుల వినియోగం, ఖాతాలు, రికార్డులపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ కూడా ఏమైనా అవకతవకలు జరిగాయా? అనే అంశంపై దేవదాయశాఖ అధికారులు దృష్టి సారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రభుత్వానికి నివేదిక**

అగస్త్యేశ్వరాలయంలో గుర్తించిన ఆర్థిక అవకతవకలపై ఈ నెల 17న ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే ఈ వ్యవహారంపై దేవదాయశాఖ నుంచి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## ఒకే రోజు రూ.53.90 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



- 42 మంది లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఖరీదైన వైద్య చికిత్సలు పొందలేని వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 42 మంది లబ్ధిదారులకు రూ. 53.90 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో సీఎంఆర్ఎఫ్ ఎంతో తోడ్పాటును అందిస్తోందన్నారు. ఖరీదైన వైద్యం చేయించుకునే స్తోమత లేని పేదలు తన కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారని, వారి పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు వైద్య చికిత్స కోసం అందుతున్న సీఎంఆర్ఎఫ్ సాయం ఎంతో ఉపశమనం కలిగిస్తోందన్నారు.
సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటివరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రూ. 8.63 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించగలిగామని గళ్ళా మాధవి తెలిపారు.
అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలిచేందుకు భవిష్యత్తులోనూ కృషి చేస్తానని స్పష్టం చేశారు. సీఎంఆర్ఎఫ్ సాయం పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

## ప్రవక్త బోధనలు ఆచరించాలి



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): మిలాద్–ఉన్ –నబీ సందర్భంగా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా బోధించిన ప్రేమ, కరుణ, శాంతి, సోదరభావం, మానవత్వ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఆఫీసర్ (ఉర్దూ) షేక్ నాగూర్‌వలి కోరారు. ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శమని, పేదలు, అనాథలు, ఆపన్నులకు అండగా నిలిచి సమాజంలో సమానత్వం, న్యాయాన్ని పెంపొందించారని తెలిపారు.
మిలాద్–ఉన్ –నబీని వేడుకలకే పరిమితం చేయకుండా ప్రవక్త బోధనలను జీవితంలో పాటించాలని సూచించారు.
యువత విద్యతోపాటు నిజాయతీ, క్రమశిక్షణ, సత్ప్రవర్తనను అలవరచుకోవాలని నాగూర్‌వలి అన్నారు. తల్లిదండ్రులను గౌరవించడం, ఉపాధ్యాయులను సన్మానించడం, ఆపన్నులకు సాయం చేయడం ద్వారా సమాజంలో శాంతి, సోదరభావాన్ని పెంపొందించాలని కోరారు. ఉర్దూ భాష, సాహిత్య అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థుల్లో ఉర్దూపై ఆసక్తిని పెంచాలని సూచించారు. మిలాద్–ఉన్ –నబీ సందర్భంగా ముస్లిం సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు.

# మహాగురుకులంలో సమస్యలు విలయతాండవం చేస్తున్న పట్టించుకోని జిల్లా అధికారులు

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెద్దలపల్లి ప్రభాకర్



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): మహా గురుకులంలో విద్యార్థుల సమస్యలు విలయతాండవం చేస్తున్న జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెద్దలపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఏఐవైఎఫ్ ఏఐఎస్ఎఫ్ నాయకులు తోట్లపల్లి మహా గురుకులంను సందర్శించడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం ప్రారంభంలో ఎంతో అట్టహాసంగా ప్రారంభం చేసిన మహా గురుకులం రెండవ విద్యా సంవత్సరం పూర్తవుతున్న కూడా అక్కడ ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పించకుండా వారి సమస్యలు పరిష్కరించకుండా జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులు సమస్యలను గాలికోదలారని వారు పేర్కొన్నారు. విద్యార్థుల మౌలిక వసతులైన త్రాగడానికి సరైన నీటి సదుపాయం లేకుండా ఆరవ ప్లాంట్ ఏర్పాటు చేయకుండా అదే విధంగా స్నానం చేయడానికి నీరు మరియు మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మరుగుదొడ్లల్లోకి నీరు సరఫరా ఆగిపోయిన విద్యార్థుల బాగోగులు చూడాల్సిన ప్రిన్సిపల్ కనీసం విద్యార్థుల మౌలిక వసతులపై చర్యలు తీసుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు త్రాగడానికి స్నానం చేయడానికి ఉపయోగిస్తూ రాత్రిపూట ఆ నీరు తాగడానికి వెళ్లాలంటే ఎక్కడ విషపురుగులు కరుస్తాయో అని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని, విద్యార్థులకు ఇవ్వాల్సిన మెనూలో అవకతవకలు చేస్తూ వార్డన్ మరియు ప్రిన్సిపల్ విద్యార్థుల కడుపు కొడుతున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు వారంలో రెండుసార్లు చికెన్ ఇవ్వాల్సి వస్తే ఒక్కో విద్యార్థికి 360 గ్రాములు వారంలో రెండు సార్లు ఇవ్వాలి కేవలం ఒక విద్యార్థికి 120 గ్రాములు చికెన్ ఇస్తూ మిగిలిన 40 గ్రాములు విద్యార్థుల సొమ్మును అప్పనంగా స్వాహా చేస్తున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు డైనింగ్ హాల్ చుట్టూ అపరిశుభ్రంగా ఉంది. విద్యార్థులు హాస్టల్ నుంచి స్కూలుకు పోయే దారిలో మధ్యలో చెక్ డ్యామ్ వాగు పెద్దగా ఉండడంతో విద్యార్థులు కిందపడి గాయాలపాయలవుతున్న కూడా ప్రిన్సిపాల్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడ విద్యార్థుల పరిస్థితిని పట్టించుకునే నాధుడే లేడని వారు ఆరోపించారు. ఉన్నఫలంగా పాత గురుకులంలో ఉన్న విద్యార్థులను మహా గురుకులంలోకి తరలించడంతో సరైన సిబ్బంది, వర్కర్ల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఉన్న పాత గురుకుల విద్యార్థులను ఒక్క నిమిషం పాద గురుకుల పాఠశాలకు పంపించి అక్కడ స్కూలును యథావిధిగా కొనసాగించి మహా గురుకులంకి వచ్చిన విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించి స్కూలును అభివృద్ధి చేయాలని వారు పేర్కొన్నారు. పాత గురుకుల పాఠశాలను యథావిధిగా కొనసాగించి రెండు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వసతులు కల్పించాలని లేనిపక్షంలో విద్యార్థులతో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుడిమే సురేష్ కుమార్ ఏఐఎస్ఎఫ్ నాయకులు సుమంత్ కుమార్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో ఆధునిక హంగులతో మోడల్ రైతు బజార్ ఏర్పాటు

- నేడు మోడల్ రైతు బజార్ నిర్మాణ పనులకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన
- రూ.18 కోట్లతో 5.90 ఎకరాల్లో రిటైల్&హోల్ సేల్ వెజిటబుల్ మార్కెట్ నిర్మాణం



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో మంగళగిరి నియోజకవర్గ రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. పారిశ్రామిక పురోగతికి, మౌలిక వసతుల కల్పనకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. ప్రజాదరణతో పాటు పరిపాలనా దక్షత తోడవడంతో మంగళగిరి నియోజకవర్గం సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇప్పటికే మంగళగిరి నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ వద్ద మోడల్ రైతు బజార్ నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. ఆధునిక హంగులతో చేపట్టే రిటైల్ అండ్ హోల్ సేల్ వెజిటబుల్ మార్కెట్ నిర్మాణ పనులకు గురువారం మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు.

**రూ.18 కోట్లతో 5.90 ఎకరాల్లో మోడల్ రైతు బజార్ నిర్మాణం:** మంగళగిరిలో ఏర్పాటుచేయనున్న మోడల్ రైతు బజార్ ను 5.90 ఎకరాల విస్తీర్ణంలో రూ. 18 కోట్ల అ–రబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్ ను నిర్మించనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులుగా ఉండనుంది. రిటైల్ మార్కెట్ లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటుచేయనున్నారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60షాపులు ఏర్పాటుచేస్తారు. అదేవిధంగా హోల్ సేల్ మార్కెట్ లో అన్ లోడింగ్ ప్లాట్ ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. 61.4 చ.మీల విస్తీర్ణంలో కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, 144.6 చ.మీ విస్తీర్ణంలో అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, 190 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్యాంటీన్, ప్రజల కోసం 130 చ.మీల విస్తీర్ణంలో మరుగుదొడ్లు నిర్మించనున్నారు. సరుకులు తరలించే వాహనాలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కోసం పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుచేయనున్నారు. వాటర్ సంప్, ఓవర్ హెడ్ ట్యాంక్, సెప్టిక్ ట్యాంక్, ట్రాన్స్ ఫార్మర్, జనరేటర్, గార్బేజ్ కలెక్షన్, ఆర్గానిక్ కన్వర్టర్, టెర్రస్ సోలార్ ఎనర్జీ ప్యానల్స్ వంటి సదుపాయాల కోసం ప్రత్యేక స్థలం కేటాయించడం జరిగింది.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# వర్షాభావ పరిస్థితుల్లోనూ ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు : మంత్రి అచ్చెన్నాయుడు

- ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక
- 20.35 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు.... పప్పుధాన్యాల సాగులో 23.6 శాతం వృద్ధి
- పంటల బీమా పరిధి 108 శాతం పెరుగుదల
- రైతుల కోసం ఇంతటి ముందస్తు ప్రణాళిక జగన్ పాలనలో ఎక్కడుంది?: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు ఎక్కడా విఘాతం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు చేపట్టిందని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుంటే, వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తగదని అన్నారు. రైతుల గురించి మాట్లాడే ముందు జగన్ తన ఐదేళ్ల పాలనను ఒకసారి గుర్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. 2026 జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు రాష్ట్రంలో 192.8 మి.మీ. వర్షపాతం నమోదైందని, ఇదే కాలానికి సాధారణ వం- ర్షపాతం 393.7 మి.మీ. కాగా, సాధారణంతో పోలిస్తే 51 శాతం లోటు నమోదైందని మంత్రి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ పప్పుధాన్యాల సాగులో 23.6 శాతం వృద్ధి నమోదు కావడం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికకు నిదర్శనమని మంత్రి అన్నారు. గత ఏడాది ఆగస్టు 25 నాటికి పప్పుధాన్యాల సాగు 2.16 లక్షల హెక్టార్లు కాగా, ఈ ఏడాది అదే తేదీ నాటికి 2.66 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపారు. పంటల వారీగా కంది 1.92 లక్షల హెక్టార్ల నుంచి 2.30 లక్షల హెక్టార్లకు, మినుము / బ్లాక్‌గ్రామ్ 0.17 లక్షల హెక్టార్ల నుంచి 0.30 లక్షల హెక్టార్లకు, పెసలు 0.041 లక్షల హెక్టార్ల నుంచి 0.061 లక్షల హెక్టార్లకు, సోయాబీన్ 0.048 లక్షల హెక్టార్ల నుంచి 0.100 లక్షల హెక్టార్లకు పెరిగినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రధాన పంటల సాగు విస్తీర్ణం వరి -- 10.37 లక్షల హెక్టార్లు, కంది - 2.30 లక్షల హెక్టార్లు, వేరుశనగ - 1.37 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న - 1.00 లక్షల హెక్టార్లు, మినుము - 0.30 లక్షల హెక్టార్లు, పెసలు - 0.061 లక్షల హెక్టార్లుగా ఉందని తెలిపారు. పత్తి సాగు కూడా గత ఏడాది 25.08.2025 నాటికి 3.96 లక్షల హెక్టార్లు ఉండగా, ఈ ఏడాది 3.97 లక్షల హెక్టార్లకు చేరిందని, స్వల్ప పెరుగుదల నమోదైందని మంత్రి చెప్పారు. సాధారణ సీజన్ లక్ష్యం 5.15 లక్షల హెక్టార్లు అని తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే అధిక స్థాయిలో సాగు నమోదైందన్నారు.

**ఫిబ్రవరి నుంచే ఎల్‌నినోపై అప్రమత్తం :** ఎల్‌నినో గురించి కేంద్రం అలర్ట్ చేసినప్పటి నుంచే, అంటే ఫిబ్రవరి 2026 నుంచి, రాష్ట్రప్రభుత్వం నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించిందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించామని చెప్పారు. నీటిని ఎక్కువగా వినియోగించే పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించే విధంగా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఖరీఫ్ 2026కు సంబంధించి జిల్లాల వారీగా కరువు నివారణ ప్రణాళికలు, సంక్షోభ నిర్వహణ ప్రణాళికలు రూపొందించామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎల్‌నినో ప్రభావంతో పంటల నష్టాన్ని నివారించేందుకు, రైతులను ఆదుకునేందుకు "రైతన్న మీకోసం - ఎల్‌నినో ప్రభావ నివారణ ప్రణాళిక - ఖరీఫ్ 2026" కార్యక్రమాన్ని 07.08.2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

**పేరుకే ఉచిత పంటల బీమా.. కానీ రైతులకు చేసింది అంతా మోసం :** జగన్ హయాంలో ఐదేళ్లలో ఒక్క రబీ సీజన్‌లో కూడా ఒక్క రైతుకు ఒక్క పైసా పంటల బీమా పరిహారం ఇవ్వలేదు.



ఖరీఫ్‌లో కూడా ఐదేళ్లలో కేవలం రెండేళ్లు మాత్రమే ప్రీమియం చెల్లించి, మూడు సంవత్సరాలు ప్రభుత్వం తన వాటా ప్రీమియం కూడా చెల్లించలేదు. రైతులకు ఉచిత పంటల బీమా అని ప్రచారం చేసుకోవడం తప్ప, ఆచరణలో రైతులకు బీమా భరోసా కల్పించలేదు. ఇదేనా రైతుల పట్ల మీకున్న చిత్తశుద్ధి జగన్ ?. రైతులపై పంటల బీమా ప్రీమియం చెల్లించాలంటూ తమ ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులపై భారం మోపడం తమ ప్రభుత్వ విధానం కాదని, అత్యల్ప ప్రీమియంతో స్వచ్ఛందంగా పంటల బీమాలో చేరేలా రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జగన్ నీ హయాంలో రైతుల పంటలకు బీమా భరోసా ఏమైంది? అని మంత్రి ప్రశ్నించారు. రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయడమే తప్ప, ప్రభుత్వం తన వాటా ప్రీమియాన్ని సక్రమంగా చెల్లించని పరిస్థితి మీ పాలనలో ఎందుకు ఏర్పడిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న స్వచ్ఛంద పంటల బీమా విధానంలో రైతులు బీమా మొత్తంలో కేవలం 2 శాతం మాత్రమే ప్రీమియంగా చెల్లిస్తున్నారని, మిగిలిన ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటాల్లో భరిస్తున్నాయని మంత్రి తెలిపారు. రైతులు చెల్లించే ప్రీమియం కూడా అత్యల్పంగా ఉందని చెప్పారు. వరి ఎకరాకు రూ.76, సజ్జకు రూ.32, మినుముకు రూ.38, వేరుశనగకు రూ.280, జొన్నకు రూ.35, మొక్కజొన్నకు రూ.66, కందికిరూ.36, ఉల్లికి రూ.90, మిరపకు రూ.360 చొప్పున రైతుల ప్రీమియం ఉందని వివరించారు. క్లస్టర్, జిల్లా, పంట, బీమా కంపెనీని బట్టి ప్రీమియం రేట్లలో స్వల్ప వ్యత్యాసాలు ఉండవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతులకు ముందస్తు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని మంత్రి తెలిపారు. ఫలితంగా రైతులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పంటల బీమాలో చేరారని చెప్పారు. ఖరీఫ్-2025లో 19.5 లక్షలుగా ఉన్న బీమా దరఖాస్తులు ఖరీఫ్-2026లో 35.1 లక్షలకు పెరిగాయని, బీమా విస్తీర్ణం 7.83 లక్షల హెక్టార్ల నుంచి 15.1 లక్షల హెక్టార్లకు పెరిగిందని మంత్రి తెలిపారు. రుణేతర రైతుల దరఖాస్తులు కూడా గత ఏడాది 2 లక్షల నుంచి ఈ ఏడాది 20.35 లక్షలకు పెరిగాయని చెప్పారు. ఇప్పటివరకు సుమారు రూ.13,983 కోట్ల విలువైన పంటలకు బీమా భరోసా కల్పించామని, బీమా విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఐదో స్థానంలో ఉందని తెలిపారు.

**2019--24 మధ్య రైతుల పంటల బీమాపై జగన్ ప్రభుత్వం ఏం చేసింది? :** 2019-24 మధ్య ఐదేళ్లలో ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియం చెల్లించిందని చెప్పడం పచ్చి అబద్ధం. గణాంకాలు చూస్తే అసలు నిజం బయటపడుతుంది అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. 2016 నుంచి 2019 వరకు కేంద్ర ప్రభుత్వ పీఎంఎఫ్‌బీవై అమలులో ఉందని, ఖరీఫ్-2020, 2021లో రాష్ట్ర ప్రభుత్వం సొంత పంటల బీమా పథకాన్ని అమలు చేసిందని తెలిపారు. 2022లో తిరిగి పీఎంఎఫ్‌బీవైలో చేరినప్పటికీ, ఖరీఫ్-2023లో పథకాన్ని అమలు చేసి కూడా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన ప్రీమియాన్ని చెల్లించలేదని స్పష్టం చేశారు. జగన్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు, ఐదు ఖరీఫ్ సీజన్లలో కేవలం మూడు సంవత్సరాలు మాత్రమే పంటల బీమా అమలు చేశారు. పథకం అమలు చేసిన చోట కూడా రాష్ట్రప్రభుత్వం తన వాటా ప్రీమియం చెల్లించలేదు. ఇదేనా రైతుల పట్ల మీకున్న చిత్తశుద్ధి? అని మంత్రి నిలదీశారు. రబీ పంటల విషయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. 2019-24 మధ్య ఐదు రబీ సీజన్లలో మూడు సంవత్సరాలు ఏ పంటకూ బీమా పథకం అమలు చేయలేదని, మిగిలిన రెండు సంవత్సరాల్లో పథకం అమలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ప్రీమియం చెల్లించలేదని తెలిపారు. మీ హయాంలో ఐదేళ్లలో రబీ పంటల బీమా ద్వారా రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం లేదా ప్రయోజనం అందలేదు. అలాంటప్పుడు ప్రభుత్వమే రైతుల పంటల బీమా ప్రీమియం చెల్లించిందని ఎలా చెబుతారు? రైతులను తప్పుదోవ పట్టించడమే కాదా? అని మంత్రి ప్రశ్నించారు.

**జగన్ ప్రభుత్వం వదిలిన ?2,000 కోట్ల బకాయిలను కూడా మేమే చెల్లిస్తున్నాం :** గత ప్రభుత్వం చెల్లించకుండా మిగిల్చిన సుమారు రూ.2,000 కోట్ల బకాయిలతోపాటు, ప్రస్తుతం చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని కూడా దశలవారీగా విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సమర్పించి హామీ ఇచ్చామని మంత్రి తెలిపారు. 2026-27లో రూ.500 కోట్లు, 2027-28లో రూ.1,000 కోట్లు, 2028-29లో రూ.1,500 కోట్లు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వంతో అంగీకారం కుదిరిందన్నారు. 2026-27 బడ్జెట్ అంచనాల్లో ఇప్పటికే రూ.250 కోట్లు కేటాయించామని, ఖరీఫ్-2026 రైతుల నమోదు సజావుగా జరిగేందుకు ఎస్క్రో ఖాతాలో అవసరమైన ప్రీమియం మొత్తాన్ని కూడా విడుదల చేశామని తెలిపారు.

జగన్ నీ హయాంలో రైతులకు బీమా భరోసా ఇవ్వకుండా, ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియాన్ని బకాయిలుగా మిగిల్చారు. మీరు వదిలిన సుమారు రూ.2,000 కోట్ల బకాయిలను కూడా మేమే పరిష్కరిస్తున్నాం. మీరు రైతులకు ఇచ్చింది బీమా భరోసానా? లేక బకాయిల భారమా?అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. నీ హయాంలో రైతును బీమా రక్షణకు దూరం చేశారు. చంద్రబాబు నాయుడు హయాంలో రైతుకు బీమా భరోసా కల్పిస్తున్నాం. రైతుపై భారం వేయడం మా విధానం కాదు... రైతుకు భరోసా ఇవ్వడం మా విధానం. రైతుల పంటకు బీమా రక్షణ, రైతు కుటుంబానికి భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## సీపీఎం సీనియర్ నేత మధు సతీమణి మృతి పట్ల ముఖ్యమంత్రి సంతాపం

**అమరావతి, ఆగస్టు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ పి. మధు సతీమణి, ఐద్వా నాయకురాలు సుమతి అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. మహిళా హక్కుల సాధనకు, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఐద్వా నాయకురాలిగా సుమతి సేవలందించారని సీఎం చంద్రబాబు అన్నారు. మరణానంతరం కూడా ఆమె పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించాలని కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఆదర్శనీయమన్నారు. సుమతి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నేపాల్‌లో మెరుపు వరదలు.. 105 మంది భారతీయుల



**నేపాల్ :** ఒక్కసారిగా నది ఉప్పొంగడంతో సంభవించిన మెరుపు వరదలు నేపాల్ ను అతలాకుతలం చేశాయి. ఈ ప్రకృతి విపత్తులో దాదాపు 500 మందికిపైగా గల్లంతయ్యారని నేపాల్ అధికారులు వెల్లడించారు. వీరిలో 105 మంది భారతీయ పర్యాటకులు ఉన్నట్లు తెలుస్తోంది. మరో 37 మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. గల్లంతయిన వారిలో 93 మంది నేపాల్ జాతీయులూ ఉన్నారు.

భోటెకోశీ నది బుధవారం ఉదయం ఉద్ధృతంగా ప్రవహించింది . నదిలో ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో రసువా జిల్లాలోని పలు గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని నేపాల్ ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇళ్లు, ప్రాజెక్టు కేంద్రాలు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోయారు. 41 మంది భద్రతా సిబ్బంది గల్లంతయ్యారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. నేపాల్ ప్రభుత్వం అత్యవసర సహాయక చర్యలు చేపడుతోంది. అయితే పర్వత ప్రాంతాలు కావడంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి.

**బిహార్, ఉత్తరప్రదేశ్‌కు అడ్వైజరీలు.. :** నేపాల్‌కు సరిహద్దులో ఉన్న బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు కేంద్రం అడ్వైజరీలు జారీ చేసింది. గండక్ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితి నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించింది.ప్రకృతి విపత్తు ప్రభావం చైనాను తాకింది. టిబెట్‌లోని చైనా-నేపాల్ సరిహద్దులో కొండచరియలు విరిగిపడటంతో ప్రాణనష్టం సంభవించింది. నివాస ప్రాంతాలకు నష్టం వాటిల్లింది. దీంతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పూర్తిస్థాయి సహాయక చర్యలకు ఆదేశించారు. మరోవైపు, మెరుపు వరదలకు సంబంధించి ముందస్తు వార్నింగ్ ఇవ్వడంలో చైనా విఫలమైందనే ఆరోపణలు నేపాల్‌లో వినిపిస్తున్నాయి.

## జోరుగా 'ఇంటింటికీ తెలుగుదేశం'..

- ఒక్కరోజే 2.31 లక్షల ఇళ్లకు!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. బుధవారంతో ఈ కార్యక్రమం 31వ రోజు పూర్తి చేసుకుంది.

రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. బుధవారం ఒక్కరోజే 2,31,918 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 86.24 లక్షల కుటుంబాలను పార్టీ శ్రేణులు నేరుగా కలిశాయని టీడీపీ వర్గాలు వెల్లడించాయి.

ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ప్రతి గడపకూ వెళ్లి, ఆయా కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసాను, అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తున్నారు.

## ఉద్యోగుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు : ఏఐటీయూసీ, సీఐటీయూ

- 28న రాష్ట్రస్థాయి సదస్సుకు ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలకు ఏపీజేఏసీ అమరావతి ఆహ్వానం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఈనెల 28న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సుకు ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర నాయకులను ఆహ్వానించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయా సంఘాల నాయకులు హామీ ఇచ్చారు.

సదస్సుకు హాజరై ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించాలని కోరుతూ ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఉద్యమ పోరాట కమిటీ చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర నాయకులను కలిశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్.నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముజఫర్ అహ్మద్, కె.సుబ్బరావమ్మలను కలిసి సదస్సుకు ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీజేఏసీ అమరావతి చేపడుతున్న ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఉద్యమ కార్యక్రమాల్లోనూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

బొప్పరాజు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 28న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు ఉద్యోగులు, కార్మిక సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం ప్రకటించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణకు ఈ సదస్సు దిశానిర్దేశం చేసే వేదికగా నిలుస్తుందని తెలిపారు.

పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలపై పోరాడే అన్ని సంఘాల నాయకులు సదస్సుకు హాజరై మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.అనుపమ, ఎన్టీఆర్ జిల్లా జేఏసీ చైర్మన్ బత్తిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ భద్రతలో క్రిప్టోగ్రఫీ కీలకం



- ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అవగాహన కార్యక్రమం

**మేడికొండూరు (జర్నలిస్ట్ ఫైల్):** డిజిటల్ యుగంలో వ్యక్తిగత, సంస్థాగత సమాచారాన్ని సురక్షితంగా ఉంచడంలో క్రిప్టోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తుందని మైసూరులోని విద్యా వర్ధక కళాశాల పరిశోధనా విభాగాధిపతి డా. ఏ.వి. రాజేంద్ర తెలిపారు. మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో క్రిప్టోగ్రఫీ, సైబర్ భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన అతిథి వక్తగా పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ సేవల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సమాచార భద్రతకు క్రిప్టోగ్రఫీ ఎంతో అవసరమన్నారు. చదవగలిగే సమాచారాన్ని గణిత అల్గారిథమ్స్, కీలు ఉపయోగించి ఇతరులు సులభంగా అర్థం చేసుకోలేని రూపంలోకి మార్చే ప్రక్రియను క్రిప్టోగ్రఫీగా వివరించారు. ఈ విధానం ద్వారా అనధికార వ్యక్తుల నుంచి కీలక సమాచారాన్ని రక్షించవచ్చన్నారు. సమాచార గోప్యత, డేటా సమగ్రత, ప్రామాణీకరణ, తిరస్కరించలేని ధృవీకరణ వంటి కీలకమైన భద్రతా ప్రయోజనాలను క్రిప్టోగ్రఫీ అందిస్తుందని తెలిపారు.

ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, ఈ-కామర్స్, క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ అప్లికేషన్లు, డిజిటల్ కమ్యూనికేషన్ తదితర రంగాల్లో క్రిప్టోగ్రఫీ విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవడం అత్యంత అవసరమన్నారు. క్రిప్టోగ్రఫీ, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై పట్టు సాధించడం ద్వారా ఉన్నత విద్య, పరిశోధన, ఉద్యోగ రంగాల్లో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా డేటా రక్షణ, సైబర్ భద్రత, క్రిప్టోగ్రఫీ వినియోగంపై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కలిగింది.

## జూనియర్ వైద్యుల స్టైపెండ్ పెంపుపై నేడు ఉన్నతస్థాయి కమిటీ భేటీ

- హైకోర్టు ఆదేశాల మేరకు సమావేశం.. పలు అంశాలపై చర్చ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** జూనియర్ వైద్యుల స్టైపెండ్ పెంపు అంశంపై హైకోర్టు ఆదేశాల మేరకు నేడు ఉన్నతస్థాయి కమిటీ సమావేశం నిర్వహించనున్నారు.

మంగళగిరిలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగే ఈ సమావేశంలో స్టైపెండ్ పెంపు అంశంపై సమగ్రంగా పరిశీలించనున్నారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న స్టైపెండ్ విధానం, జూనియర్ వైద్యుల డిమాండ్లు, స్టైపెండ్ పెంపునకు సంబంధించిన వివిధ అంశాలపై కమిటీ సభ్యులు చర్చించనున్నారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్టైపెండ్ పెంపు సాధ్యాసాధ్యాలు, అనుసరించాల్సిన విధానాలపై కూడా కమిటీ పరిశీలన చేయనుంది.

వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీర పాండ్యన్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. వైద్య విద్య సంచాలకులు డాక్టర్ విష్ణువర్ధన్ సభ్య కన్వీనర్‌గా, సెకండరీ హెల్త్ సంచాలకులు చక్రధర్ బాబు, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ఏపీ జూడా అధ్యక్షుడు, కార్యదర్శి తదితరులు కమిటీ సభ్యులుగా ఉన్నారు.

జూనియర్ వైద్యుల స్టైపెండ్ పెంపు అంశంపై నేడు జరగనున్న ఉన్నతస్థాయి కమిటీ సమావేశంపై వైద్య వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కమిటీ చర్చలు, పరిశీలన అనంతరం ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

## ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలి : ఏపీటీఎఫ్

- ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు ఆహ్వానించాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని, ప్రత్యేక టెట్‌లో ఉపాధ్యాయులకు వెసులుబాట్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన నిరసన, ధర్నా కార్యక్రమాలు విజయవంతమయ్యాయని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయ రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి తెలిపారు.

కర్నూలు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న హృదయ రాజు మాట్లాడుతూ 20 నుంచి 33 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులకు మళ్లీ టెట్ నిర్వహించడం వల్ల ప్రయోజనం ఎవరికి కలుగుతుందో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేయాలని ప్రశ్నించారు. ఇప్పటికే సుదీర్ఘకాలంగా బోధనా అనుభవం ఉన్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు మరోసారి అర్హత పరీక్ష నిర్వహించడం సమంజసం కాదన్నారు.

విద్యా హక్కు చట్టంలోని నిబంధనల నేపథ్యంలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల నాణ్యత ప్రమాణాల పెంపుదలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి వంటి చర్యలు అవసరమని, మళ్లీ అర్హత పరీక్ష రాయాలని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ఆర్టీఈ చట్టం-2010లోని సెక్షన్ 23(1)పై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంట్‌లో తగిన సవరణలు తీసుకువచ్చి ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు.

తమిళనాడు ప్రభుత్వం టెట్ రద్దుకు సంబంధించి తీర్మానం చేసి కేంద్రానికి పంపిన తరహాలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా టెట్ రద్దు కోసం తీర్మానం చేసి, ఆర్టీఈ చట్టంలో అవసరమైన సవరణలు తీసుకురావాలని కేంద్రాన్ని కోరాలని హృదయ రాజు డిమాండ్ చేశారు.

నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి మాట్లాడుతూ టెట్‌ను పూర్తిగా రద్దు చేసే వరకు ప్రస్తుతం జారీ చేసిన ప్రత్యేక టెట్ నోటిఫికేషన్‌లో పాస్ మార్కులను అందరికీ 40 శాతంగా నిర్ణయించాలని కోరారు. ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను మాత్రమే పరీక్షలో అడిగేలా సిలబస్‌లో మార్పులు చేయాలని, ఆన్‌లైన్‌కు బదులుగా ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల టెట్‌ను డిసెంబర్‌లో నిర్వహించేలా పరీక్ష తేదీలను మార్చాలని కోరారు. టెట్ అంశంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని చిరంజీవి కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

బందరులో ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకుడు జి.సత్యనారాయణ, విజయనగరంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డి.ఈశ్వర్ రావు, మాజీ అధ్యక్షుడు ఏ.సదాశివరావు, అదనపు కార్యదర్శి పి.ధనుంజయ్ రావు, నెల్లూరులో ఐఫియా జాతీయ నాయకుడు కె.సుబ్బారెడ్డి, శ్రీకాకుళంలో రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్ కుమార్, అనంతపురంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.సుబ్బయ్య తదితరుల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం తెలిపింది.

రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో రాష్ట్ర సబ్‌కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారని ఏపీటీఎఫ్ పేర్కొంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467